
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.4
ANDHRAJYOTHY

నల్లగొండ
5
ఆదివారం 2 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.80 (311.4474)	1,17,860	1,17,860
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	13,353.61	12,157.10
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	1,27,975	1,37,160

చికెన్ ధరలు | లైవ్: రూ.140 | డ్రెస్: రూ.220 | స్కిన్‌లెస్: రూ.250

డీసీఎంఎస్ ఎత్తివేత వైపు అడుగులు



నాగార్జున జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ను ఎత్తివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. డీసీఎంఎస్ అవసరం లేదనే అభిప్రాయానికి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇతర కార్పొరేషన్లలో విలీనం చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించింది. వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న డీసీఎంఎస్ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ నేపథ్యంలో విలీనం లేదా, రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- దివాలా అంచున మార్కెటింగ్ సొసైటీ
- ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి
- ఉమ్మడి జిల్లాలో రూ.100కోట్ల విలువైన ఆస్తులు
- ఇప్పటికే పాలకవర్గానికి పొడిగింపు ఇవ్వని ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రోస్‌తో పాటు ప్రధానంగా నాగార్జున జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీపై దృష్టి సారించింది. అదేవిధంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ అథారిటీ,మార్క్‌ఫెడ్ వేర్ హౌసింగ్‌లను విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. విలీన ప్రక్రియకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులను ఆదేశించింది. విత్తనాలు, ఎరువుల సరఫరా ధాన్యం కొనుగోలు, తదితర సేవలు అందించేందుకు గతంలో డీసీఎంఎస్‌లు ఏర్పాటయ్యాయి. అయితే వీటికి సరైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో అభివృద్ధి చెందలేదు. డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ఉద్యోగుల కొరత, తాత్కాలిక ఉద్యోగుల నియామకం, పాలకవర్గాలు ఆసక్తిగా పనిచేయకపోవడంతో ఇవి ప్రభుత్వానికి భారంగా మారాయి.

రూ.100కోట్లకు పైగా ఆస్తులు

నాగార్జున జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.100కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మూడు ఎకరాలు, యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో దుకాణాల సముదాయం ఉంది. గతంలో ఈ ఆస్తుల విక్రయం వివాదాస్పదంగా మారి కోర్టుల వరకు వెళ్లింది. అప్పట్లో పాలకవర్గం నిర్ణయాలు చర్చనీయాంశంగా మారాయి. పాలకవర్గంలో తీర్మానం జరిగిందా? లేక వ్యక్తిగతంగా విక్రయించారా? అనేదానిపై ఉమ్మడి జిల్లాలో చర్చకు దా రి తీసింది. నల్లగొండ జిల్లా కేంద్రమైన గడియారం సెంట ర్ సమీపంలో విలువైన ఆస్తులతో పాటు నిడమనూరు లో మూడు ఎకరాలు, యాదాద్రి జిల్లా రామన్నపేటలో గోదాములు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోట్ల రూపాయల విలువైన ఆస్తులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. గతంలో ఓ పాలకవర్గం హయాంలో డీసీఎంఎస్ ఆస్తులను దుర్వినియోగం చేయడంతో సమస్యలు చోటుచేసుకున్నాయి. ఆస్తుల రికవరీ కూ డా సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డీసీఎంఎస్‌ను పూర్తిగా రద్దు చేయడం కోసం కార్యాచరణకు సిద్ధమైంది. ప్రభుత్వ సొమ్ము, ఆస్తులు దుర్వినియోగం అవుతుండటంతో వాటిని కాపాడడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు నష్టం కాకుండా ఉండేలా ప్రణాళిక రూపొందించి ఆ వైపుగా అడుగులు వేస్తోంది. దీనికి తోడు డీసీఎంఎస్ నిర్వహణ ప్రభుత్వానికి భారంగా మారింది. ఉద్యోగుల జీతభత్యాలు ఇవ్వడం కూడా కష్టతరమైంది. కనీసం డీసీఎంఎస్ కార్యాలయంలో ఫర్నీచర్ కూడా లేని దుస్థితి నెలకొంది. తాత్కాలిక ఉద్యోగులే ఉన్నప్పటికీ వారికి సకాలంలో వేతనాలు అందని పరిస్థితి ఉంది.

నివేదిక సేకరించిన ప్రభుత్వం

ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆ సొసైటీ అధికారుల నుంచి ప్రభుత్వం వివరాలు తీసుకుంది. ఈ నేపథ్యంలో డీసీఎంఎస్ మేనేజర్ ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్ ఆస్తులు,వాటి వివరాలను ఆ నివేదికలో పొందుపర్చారు. అదేవిధంగా సంబంధిత సొసైటీలో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలు,తాత్కాలిక ఉద్యోగులు, జీతభత్యాలు, తదితర వివరాలను సేకరించింది. డీసీఎంఎస్‌ను మూసి వేసేందుకు ప్రభుత్వ..

- మిగతా 7వ పేజీలో...

ముగ్గు పోయకుంటే రద్దే

- నిర్మాణం ప్రారంభం కాని ఇళ్లు 1,807
- గడువు ఇచ్చినా పలు కారణాలతో ముందుకురాని లబ్ధిదారులు



పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా నిర్మాణాన్ని ప్రారంభించకుంటే వాటిని అధికారులు రద్దుచేసి అర్హులైన మరొకరికి వీటిని కేటాయిస్తున్నారు. జిల్లాకు మొత్తం 9,597 ఇందిర మ్మ ఇళ్లు మంజూరు కాగా, అందులో 1,807 ఇళ్ల నిర్మాణం నేటికీ ప్రారంభం కాలేదు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలకు గృహ నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. అయితే ఇళ్లు మంజూరు చేసినా, నేటికీ కొందరు నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ప్రభుత్వం సాయం చాలదని కొందరు, ప్రభుత్వ కొలతలతో నిర్మిస్తే ఇళ్లు ఇరుకుగా ఉంటుందని మరికొందరు ముందుకు రావడంలేదు. ఇంకొందరు సాంకేతిక సమస్యలతో వెనకడుగు వేస్తున్నారు. వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇళ్లు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు ముగ్గు పోయకుండా ఉన్న లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు జారీచేసింది. వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో వారి స్థానంలో అర్హులైన కొత్తవారికి ఇళ్లను మంజూరు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. యాదాద్రి జిల్లాలో ఈ పథకం కింద తొలి విడతగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఐదు నియోజకవర్గాల్లో 9,597మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 7,890 మంది ముగ్గు పోసి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి. బేస్‌మెంట్ స్థాయిలో 6,736, రూఫ్‌లెవల్‌లో 3,570, స్లాబ్ లెవల్లో 1,898, 100శాతం పూర్తయిన ఇళ్లు 42 వరకు ఉన్నాయి. ఈ పథకం డబ్బుల జమ ఆలస్యం కాకుండా అధికారులు చూస్తున్నారు.

ముగ్గులు పోయని ఇళ్లు 1,807

యాదాద్రి జిల్లాలో మొత్తం 17మండలాలు 427 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. ప్రభుత్వం రెండు విడతల్లో 9,597 ఇళ్లను మంజూరు చేసింది. అయితే ఇప్పటివరకు ముగ్గులు పోసుకుని ఇళ్లు జిల్లాలో మొత్తం 1,807వరకు ఉన్నాయి. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ఇచ్చిన గడువులో ముగ్గులు పోసుకోకపోవడంతో వీరి స్థానంలో వేరేవారికి అవకాశం కల్పించాలని యోచిస్తున్నారు. భువనగిరిలో నియోజకవర్గంలో మొత్తం 3,297 ఇళ్లు మంజూరు కాగా, 627ఇళ్లు ముగ్గులు ప్రారంభించలేదు. అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలో 3,824ఇళ్లకు 726, మునుగోడు నియోజకవర్గం (చౌటుప్పల్, నారాయణపూర్)లో 1,314ఇళ్లకు 230 ఇళ్లకు ముగ్గు పోయలేదు. తుంగతుర్తి నియోజకవర్గం(అడ్డగూడూరు, మోత్కూరు)లో 573ఇళ్లకు 89, నకిరేకల్ నియోజకవర్గం(రామన్నపేట)లో 689ఇళ్లకు 135 ఇప్పటికే ముగ్గులు పోసుకోలేదు.

ఇళ్లను సకాలంలో ప్రారంభించాలని పలుమార్లు గడువు ఇచ్చినప్పటికీ, లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. లబ్ధిదారుల నుంచి స్పందన లేకపోవడంతో వారిని నుంచి అంగీకారపత్రం తీసుకుని, ఇళ్లను రద్దు చేసి వేరే వారికి మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రైతుల ఇబ్బందులను పట్టించుకోని ప్రభుత్వం



మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల, నాయకులు

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా చూసినా హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయని, పంటలు నష్టపోయి రైతులు విలవిలాడుతున్నారన్నారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మంత్రులు కమీషన్లు, సంపదలపై దృష్టిసారించారని, విదేశీ టూర్లలో జల్సాలు చేస్తున్నారని అన్నారు. రైస్ మిల్లుల వద్ద కోట్ల రూపాయలు లంచాలు తీసుకుంటున్నారని, దీంతో మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారన్నారు. ఎక్కడా చూసినా మొలకలు వచ్చిన ధాన్యం కనిపిస్తోందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యాన్ని, పత్తిని కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఇబ్బందులను గురిచేయడమే ధ్యేయంగా పనిచేస్తోందని, యూరియా కొరతతో ఇబ్బందులు పెట్టిన ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, బోనగిరి దేవేందర్, తుమ్మల లింగస్వామి, రావుల శ్రీనివాస్ రెడ్డి, మారగోని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశాం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని 10 మండలాల పరిధిలో కొంతమేర తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సుమారు 4,600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందన్నారు. రైతులు ఆ ధాన్యాన్ని ఆరబెట్టారని, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు సుమారు 2,653 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించామన్నారు. అదేవిధంగా, ఆ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేశామని, రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేశామన్నారు. రైతులు అధైర్యపడవద్దని, ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం వచ్చాక కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు.

ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు చర్యలు...

సెట్విన్ ఆధ్వర్యంలో యువత, విద్యార్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం సెట్విన్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేకించి విద్యార్థినులు 10వ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తయ్యాక వెంటనే ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రణాళిక తయారు చేయాలన్నారు. సెట్విన్ ద్వారా అందించే కోర్సులు, వాటికి విద్యార్హతలపై జిల్లాలోని అన్ని సంక్షేమ కళాశాలలు, పాఠశాలలు, కేజీబీవీల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు ఒక షెడ్యూల్ రూపొందించాలని, వచ్చేవారం ఇవి ప్రారంభించాలన్నారు. అంతకుముందు సెట్విన్ ప్రతినిధి రేణుక మాట్లాడుతూ, సెట్విన్ ద్వారా సుమారు 30 కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

లైంగిక దాడులు జరగకుండా చర్యలు

శిశువిక్రయాలు, బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరగకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఎక్కడైనా శిశు విక్రయాలు జరిగితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహాలపై విస్తృత ప్రచారం కల్పించాన్నారు. సీడీపీవోలు వారి పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దేవరకొండ, నేరేడుగొమ్ము, చందంపేట, పెద్దవూర, అడవిదేవులపల్లి, తదితర ప్రాంతాల్లో శిశువిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిపై సీడీపీవోలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వాల్ పోస్టర్లు, కరపత్రాలు, ప్లెక్సీలు, వీడియోల ద్వారా చైతన్యం కల్పించాలన్నారు. వచ్చేవారం సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ పీడీ రాజ్ కుమార్, డీఈవో భిక్షపతి, డీపీవో వెంకయ్య, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డి, డీటీడీవో ఛత్రునాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): వర్షాలతో ధాన్యం తడవ కుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం నల్లగొండల మండలంలోని చిన్న సూరారం, కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, కొత్తపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేశారు. ధాన్యం తడవకుండా ముదస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన బస్తాలు, లారీలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఇదిలా ఉండగా కేతేపల్లి మండలంలోని కొత్తపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దనున్నారు. అందుకు సాధ్యాసాధ్యాలను కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, డీసీఎస్‌వో వెంకటేశం, డీసీవో పత్యానాయక్, కేతేపల్లి తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, డీటీసీఎస్ జ్యోతి, ఏపీఎం మల్లేష్, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సహకరించాలి

సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా మిల్లర్లు సహకరించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ కోరారు. స్థానిక సబ్‌కలెక్టరేట్ కార్యా లయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. వర్షాలతో పంటలు దెబ్బతిన్నందున తేమ, తాలూ లాంటి కొర్రీలు పెట్టకుండా మిల్లు పాయింట్ల వద్దకు వ చ్చిన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. వేబ్రిడ్జిల వద్ద తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. తూనికల కొలతల అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. రైతులు మేలైన ధా న్యాన్ని తేవాలని సూచించారు. బయటి రాష్ట్రాల నుంచి ధాన్యం రాకు ండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే ధాన్యం లోడ్‌లకు టోకెన్లు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్



పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, లేకుంటే విడుదల చేసేంత వరకు పోరాటాలను నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ హెచ్చరించారు. పెండింగ్ స్కాలర్షిప్, ఫీయిజ్‌రియంబస్ మెంట్ విడుదల చేయాలని అందుకు నిరసనగా, భారత విద్యార్థి ఫెడరేషన్ నల్లగొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 8150 కోట్ల స్కాలర్షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పేద, మధ్య తరగతి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకోలేక విద్యకు దూరం అవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యా సంస్థలు ఈనెల 3 నుంచి కళాశాలలు బంద్ చేసి నిరవధిక సమ్మెచేసేందుకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నల్లగొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏసైఫ్, మారుపాక కిరణ్, నవదీప్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు అడ్డంకులు కలగకుండా చూడాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లకు అడ్డంకులు కలగకుండా చూడాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారందిశగా అడుగులేసేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు కావడం అవసరమన్నారు. దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న వెనుకబడిన వర్గాలకు దక్కినఅవకాశం చెదరకుండా చూడాలని కనకదుర్గ అమ్మవారికి మొక్కినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, శ్రీను, అంజి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కమంలో సంఘ నాయకులు శివరామకృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేయాలి

బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో పోటీ చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావడం పోరాట ఫలితమేనన్నారు. రిజర్వుడ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో పోటీచేస్తేనే బీసీల రాజ్యాధికార కల సాకారమవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తాచాటితే భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని, అందుకు బీసీలంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బహుజన రాజ్యాధికార సాధనకు ముందడుగు వేయాలన్నారు.

శిశు విక్రయాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి

జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి

వేములపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శిశు విక్రయాలకు తావు లేకుండా ఐసీడీఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడి టీచర్లకు నిర్వహించిన సెక్టార్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టవిరుద్ధమైన దత్తత ఇచ్చిన వారు శిక్షార్హులని, అందుకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారని ఆమె అన్నారు. మైనర్ బాలికలపై అత్యాచారం, అక్రమ శిశు రవాణా, బాల్య వివాహాలు వంటి వాటిపై అంగన్‌వాడి టీచర్లకు ఆమె అవగాహన కల్పించారు.

క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు రెండు, మూడవ సంతానంలో ఆడపిల్లలు జన్మించిన ఇళ్లను ప్రతినిత్యం సందర్శించి పర్యవేక్షించాలని ఆమె అన్నారు. ఎవరికైనా ఆర్థిక ఇబ్బందులతో భారంగా భావిస్తే జిల్లా శిశు కేంద్రాలకు అప్పగించాలే కాని అక్రమ దత్తతకు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనానికి సర్వం సిద్ధం

- ముస్తాబైన ఎన్జీ కళాశాల మైదానం
- నల్లగొండకు చేరిన దున్న రాజులు

నల్లగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదవుల సంస్కృతిలో గో సంపదకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. గో సంపదను కాపాడుకునేందుకు యాదవులు అనేక పద్ధతులను పాటిస్తూ ఉంటారు. దీపావళి తర్వాత రెండో రోజు సదర్ సమ్మేళనం నిర్వహించడం ఆనవాయితీ. ఏటా ఏడు దున్నరాజులతో వైభవంగా యాదవులు సదర్ సమ్మేళనం నిర్వహించి వారి ఐక్యతను చాటుకుంటారు. అందులో భాగంగానే ఆదివారం సాయంత్రం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో యాదవుల సదర్ సమ్మేళనానికి సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే హరియాణ, హైదరాబాద్ నగరాల నుంచి దున్న రాజులను నల్లగొండకు తీసుకొచ్చారు. దున్న రాజులను అలంకరించే పనిలో యాదవులు నిమగ్నమయ్యారు. పురవీధుల గుండా దున్న రాజుల ఊరేగింపు శోభాయమానంగా సాగనుంది. దున్న రాజుల ఊరేగింపుతో పాటు ఆ ఊరేగింపులో పోతరాజు విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆకర్షణగా నిలవనున్నాయి. అవార్డు గెలుచుకున్న గోల్ టు బజరంగీ, సేహంష, కోహినూర్ దున్న రాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలవనున్నాయి. కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా నిర్వహించి యాదవుల సదర్ సమ్మేళనానికి అందరూ హాజరు కావాలని ఇప్పటికే ఉత్సవ సమితి ఆహ్వానం పలికింది. సదర్ సమ్మేళనం నిర్వహించే ఎన్జీ కళాశాల మైదానాన్ని తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు. ఈ సదర్ సమ్మేళనంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన యాదవులు, యాదవ కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేశారు.

15న లోక్ అదాలత్

నల్లగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం ఈనెల 15న ప్రత్యేక లోక్ ఆదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జి.సంపూర్ణ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కక్షిదారులు ఈ నెల 15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌లో వారి పెండింగ్ కేసులు, పీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

5 కి.మీలు.. 60 నిమిషాలు



- పెద్దకాపర్తి వద్ద ట్రాఫిక్‌జాం
- రామన్నపేట మీదుగా వాహనాల మళ్లింపు

6

5 కి.మీలు.. 60 నిమిషాలు

● పెద్దకాపర్తి వద్ద ట్రాఫిక్‌జాం ● పెద్దకాపర్తి నుంచి రామన్నపేట మీదుగా వాహనాల మళ్లింపు ● చిట్యాల వద్ద రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరడంతో నిలిచిన వాహనాలు


చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారు జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు


చిట్యాల మండలం పెద్దకాపర్తి మీదుగా రామన్నపేట వైపు వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

చిట్యాలరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై ప్రయాణం నిరీక్షణమయంగా మారింది. శనివారం వాహనాలు భారీగా నిలిచి సుమారు ఐదు కిలోమీటర్లు ప్రయాణించడానికి 60 నిమిషాలు పట్టింది. గంటల తరబడి రహదారిపై వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు వాహనాలను పెద్దకాపర్తి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మీదుగా చిట్యాల వైపునకు వాహనాలను దారి మళ్లించారు. చిట్యాల రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు అక్కడి నుంచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ వర్షపునీటిలో నెమ్మదిగా ముందుకు కదులుతుండటంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు నెమ్మదిగా ముందుకు వెళుతుండగా పెద్దకాపర్తి గ్రామ స్టేజీ వరకు రహదారిపై వాహనాలు భారీగా నిలిచాయి. రహదారిపై వేలాదిగా వెళ్లే వాహనాలు ఒకదాని వెనుక మరొకటి రావడం నెమ్మదిగా ముందుకు వెళుతుండగా వాహనాలన్నీ నిలిచి ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఇలా శుక్రవారం నుంచి పరిస్థితి ఈ విధంగానే ఉంది. చిట్యాలలోని రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు పోలీసులు రంగప్రవేశం చేసి ఎన్‌హెచ్‌ఏఐ సంస్థ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ జాం కాకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు ఆధ్వర్యంలో చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్ తన సిబ్బందితోపాటు మునుగోడు ఎస్‌ఐ ఇరుగు రవి, సిబ్బంది, నల్లగొండ ట్రాఫిక్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు పెద్దఎత్తున వచ్చి పెద్దకాపర్తి వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. పెద్దకాపర్తి బస్‌స్టేజీ వద్ద, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద పోలీసులు మోహరించి చిట్యాల వైపు వచ్చే పెద్ద వాహనాలను చిట్యాల వైపునకు, చిన్నవాహనాలను పెద్దకాపర్తి నుంచి రామన్నపేట మీదుగా చిట్యాల వైపునకు దారి మళ్లించారు. రహదారిపై, బస్‌స్టేజీ వద్ద పోలీసులు నిల్చొని వాహనాలను దారి మళ్లించారు. దీంతో చిట్యాల-పెద్దకాపర్తి మధ్య వాహనాలు నిలిచిపోవడం, ట్రాఫిక్ జాం కావడం తగ్గుముఖం పట్టింది. అంతేకాకుండా పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండటం, వాహనాలు సర్వీస్ రోడ్డు మీదకు మళ్లడమే కాకుండా తిరిగి రహదారి పైకి విజయవాడ వైపునకు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి. చిట్యాల వద్ద వాహనాల ప్రయాణం నెమ్మదించడంతో ఈ మార్గంలో రహదారిపై వెళ్లే వాహనాలన్నీ చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు రహదారిపై నిలిచి ట్రాఫిక్‌జాం కావడానికి కారణమవుతుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనులపై వెళ్లే వారు ట్రాఫిక్‌జాంతో తంటాలు పడుతున్నారు.

చిట్యాల రైల్వేబ్రిడ్జి కింద నిలుస్తున్న వర్షపునీరు

జాతీయ రహదారి విస్తరణ పనులు జరిగినప్పటి నుంచి చిట్యాలలో రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలుస్తోంది. భారీ వర్షాలు వచ్చిన సమయంలో బ్రిడ్జి కింద మోకాలు లోతులో వర్షపు నీరు నిలుస్తుండటంతో వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. 2010లో జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణ పనులు పూర్తయిన తర్వాత రైల్వేబ్రిడ్జిని ఒక మార్గంలో అప్పటి నిర్మాణ సంస్థ అయిన జీఎంఆర్ కొత్తగా ఏర్పాటు చేసింది. బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచినట్లయితే అక్కడున్న గోడలకు రంధ్రాలను ఏర్పాటు చేయగా, వర్షపు నీరు నిలిచినట్లయితే అందులో నుంచి బయటకు వెళతాయి. కానీ పూర్తిగా వర్షపు నీరు ఖాళీ అవ్వదు. ఒక్కోసారి భారీ వర్షాలు కురిస్తే, వర్షపు నీరు కూడా భారీగానే నిలిచి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు కలుగుతాయి. వర్షపు నీరు భారీగా నిలిచినట్లయితే నీటిని మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తొలగించే వారు. ఏడాదిగా జీఎంఆర్ సంస్థ కాంట్రాక్టు ముగియడం, ఎన్‌హెచ్‌ఏఐ రహదారి పనులను చేస్తోంది. ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు రైల్వే బ్రిడ్జి కింద వర్షం నీరు భారీగా చేరడం నాలుగు రోజులుగా అలానే ఉండటం వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. కార్లు, ద్విచక్రవాహనాలు అందులో నుంచి వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. వెళ్లక తప్పని పరిస్థితి అయితే వెళ్లే సమయంలో వర్షపు నీరు కార్లకు సగానికిపైగా ఎత్తు చేరుతుంది. పలువురు ద్విచక్రవాహనదారులు కింద పడిపోయిన సంఘటనలూ ఉన్నాయి. కొన్నేళ్ల కిందట ఈ విధంగానే వర్షపు నీరు నిలువడంతో హైదరాబాద్ నుంచి వచ్చిన ఒక ఖరీదైన కారు నీటిలోనుంచి రావడంతో వర్షపు నీరు కారు ఇంజన్‌లకు వెళ్లి ఆగిపోయింది. ఇంజన్‌లోకి నీరు చేరడంతో స్టార్ట్ కాకపోవడంతో పాలశీతలీకరణ కేంద్రం పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఆ ఖరీదైన కారును యజమాని ఆపి షోరూంకు సమాచారం అందించి అక్కడి నుంచి టోయింగ్‌పై తీసుకెళ్లారు.

శాశ్వత పరిష్కారం

రైల్వేబ్రిడ్జి కింద లోతు ఎక్కువగా ఉండటంవల్ల వర్షం వచ్చిన సమయంలో నీరు నిలుస్తుంది. భారీగా చేరడంతో వాహనదారులకు తిప్పలు తప్పవు. నీరు చేరినా వాటిని వెంటనే డ్రైనేజీలకు వెళ్లే విధంగా ఏర్పాటు చేసినట్లయితే సులువవుతుంది. బ్రిడ్జి కింద వర్షపు నీరు కొద్దిపాటిగా నిలిచినా వాహనాల వేగానికి వాటితోనే ముందుకు వెళ్లడంతో ఆనీరు కూడా ఖాళీ అవుతుంది.

పెద్దకాపర్తి బ్రిడ్జినిర్మాణ పనులూ కారణమే..?

జాతీయ రహదారిపై చిట్యాల మండల పరిధి గుండ్రాంపల్లి నుంచి వట్టిమర్తి వరకు 21 కిలోమీటర్ల దూరం. చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు జరుగుతుండగా వాహనాలు ప్రాంతంలో హైదరాబాద్-విజయవాడ రహదారి గుండా వెళ్లే వాహనాలు సర్వీస్‌రోడ్డుపై నెమ్మదిగా వెళుతూ రహదారిపై నుంచి వెళుతుంటాయి. ఈ సమయంలో వాహనాలు నిదానంగా వెళుతుండగా అప్పుడప్పుడు వాహనాలు నిలిచిపోవడం నిదానంగా వెళ్లడమే కాకుండా ఒక్కోసారి ట్రాఫిక్‌జాంకు కారణమవుతుంది.

గంటకు పైగా సమయం

రహదారిపై వాహనాలు నిలిచి ట్రాఫిక్‌జాం ఏర్పడటంతో పెద్దకాపర్తి నుంచి చిట్యాల వరకు ప్రయాణం సుమారు గంటకు పైగా పడుతుందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. హైదరాబాద్ వెళ్లే సమయంలో ఇరువైపుగా ప్రయాణం ఒక్కోమారు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులున్నాయని, పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం చేయాలంటే గంటన్నర నుంచి రెండు గంటలు పడుతుంది. ట్రాఫిక్‌జాం అయ్యిందంటే ఇక్కడే గంటన్నర సమయం పడుతుంది. ఇలా ఉండే రహదారిపై ప్రయాణం చేయడం కష్టంగా ఉంటుందని, మరోమార్గం లేకపోవడం ఇబ్బందికరంగా ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు.

పండుగ రోజుల్లోనూ..

మూడు రోజులు సెలవులు వచ్చినప్పుడు, పండుగ రోజులతోపాటు వారాంతంలో జాతీయ రహదారిపై ప్రయాణం గంటల కొద్దీ పడిగాపులతో ఇదే పరిస్థితి నెలకొటుందని వాహనదారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో నివాసముండే వివిధ ప్రాంతవాసులు సెలవులు వచ్చిన సమయంలో పండుగలకు స్వస్థలాలకు జాతీయ రహదారిపై ప్రయాణం చేయాలంటే జంకుతున్నారు. రహదారిపై ఏదేని వాహనం ఆగినా, దాని వెనుక నుంచి వచ్చే వాహనాలు కూడా నెమ్మదించడం, ఆగడంతో రహదదారిపై వాహనాలు భారీగా నిలిచి ట్రాఫిక్‌జాం అవుతుంది. దీంతో గంటల కొద్దీ రహదారిపై వేచి చూడాల్సిందే.

టాఫిక్‌జాంతో ఇబ్బందులు

అత్యవసర పనిమీద హైదరాబాద్‌కు కారులో వెళుతున్నాం. చిట్యాల, పెద్దకాపర్తి వద్దకు రాగానే గంటల తరబడి రహదారిపై వాహనాలు నిలిచి ఉండటం ట్రాఫిక్‌జాం కావడంతో గంటన్నరలో హైదరాబాద్‌కు చేరుకునేది గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆ మధ్య పండుగ సమయంలో పెద్దకాపర్తి వద్ద వాహనాలు నిదానంగా వెళుతుండటంతో ట్రాఫిక్‌జాం ఏర్పడి చిట్యాల నుంచి పెద్దకాపర్తికి వెళ్లేందుకు సుమారు గంటకు పైగా సమయం పట్టింది. మళ్లీ హైదరాబాద్ నుంచి వస్తుండగా చిట్యాల వద్ద మరోమారు రైల్వేబ్రిడ్జి కింద వర్షపు నీరు నిలవడంతో చిట్యాలకు చేరేందుకు సుమారు గంటన్నర సమయం పట్టింది.

విజయ్‌భాస్కర్, వాహనదారుడు, నల్లగొండ.

దూర ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో పెద్దకాపర్తి నుంచి వాహనాలు నిలిచి ట్రాఫిక్‌జాం అయ్యింది. దూరప్రాంతాలకు వెళ్లే వారికి పరిస్థితులు ఈ విధంగా ఉంటే తీవ్ర ఇబ్బందులు తప్పనట్లుగా ఉంది. స్వస్థలానికి వెళుతున్న ఆనందం ఉంది కానీ మార్గమధ్యంలో గంటల తరబడి ట్రాఫిక్‌జాం కారణంతో బస్సులో రోడ్డుపైనే వేచి ఉండటం బాధాకరంగా ఉంది.

సుమన్, బస్సు ప్రయాణికుడు విజయవాడ.

భర్త చేతిలో దారుణహత్య


సుమలత మృతదేహం

కట్టంగూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పరడ గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన వేముల మారమ్మ, శంకరయ్య దంపతుల మూడో కుమార్తె సుమలత (30)ను పరడ గ్రామానికి చెందిన పరడ మహేష్‌కు ఇచ్చి ఏడాది క్రితం వేములకొండ గుట్ట వద్ద వివాహం చేశారు. మహేష్ శనివారం ఉదయం తన అత్తగారైన మారమ్మకు, బంధువులకు ఫోన్‌చేసి సుమలతను దెబ్బలు కొట్టడంతో చనిపోయిందని, వచ్చి మృతదేహన్ని తీసుకెళ్లాలని సమాచారం ఇచ్చి పరారయ్యాడు. సుమలత తల్లి 100 నెంబర్‌కు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమలత శరీరంపై తీవ్ర గాయాలు, వెన్నుపూస మీద బలంగా తగిలిన గాయాలు, ఒంటిపై కమిలిన గాయాలు ఉన్నట్లు సుమలత తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలిపై ఉన్న బంగారం కూడా మహేష్ తీసుకెళ్లినట్లు తెలిపింది. మహేష్ గతంలో ప్రేమించి వివాహం చేసుకొని వేధింపులకు గురిచేయడంతో మొదటి భార్య తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మహేష్ వృత్తిరీత్యా లారీ డ్రైవర్. సుమలతను చంపేందుకు పక్కా ప్రణాళికతో కుట్ర పన్నిన మహేష్ తన అన్నదమ్ములైన పరడ మురళి, గిరితోపాటు అత్తమామలు పరడ నర్సమ్మ, ఎల్లయ్యలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వేముల మారమ్మ ఫిర్యాదు చేశారు. వేముల మారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కట్టంగూరు ఎస్‌ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.

నిందితులకు రిమాండ్

చౌటుప్పల్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజీగూడెంలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడియత్నానికి పాల్పడిన నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మన్మదకుమార్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుల దంపతుల కుమార్తె ఆరుబయట ఆడుకుంటుండగా చాక్లెట్లు ఇస్తామని చెప్పి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మహసారేవా జిల్లాకు చెందిన శివరాజు పూల్(45), దినేష్ పూల్(42) ఇంట్లోకి తీసుకవెళ్లి లైంగిక దాడికి యత్నించారు. స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. నిందితులను అరెస్టు చేశారు. శనివారం చౌటుప్పల్ మెజిస్ట్రేట్ వైష్ణవి ముందు హాజరు పరుచగా, ఆమె ఆదేశాల మేరకు నిందితులను నల్లగొండ జైలుకు రిమాండ్ చేశారు. బాధిత చిన్నారి బాలిక ఆరోగ్యం నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు.

కూలీల ఆటో బోల్తా


ప్రమాదస్థలిలో క్షతగాత్రులు

మేళ్లచెర్వు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలో శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వేగంగా వెళ్తున్న ఓ ఆటోకు కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన 15 మంది మహిళా వ్యవసాయ కూలీలు పత్తి ఏరేందుకు రేవూరు గ్రామానికి ఆటోలో బయలుదేరారు. మేళ్లచెర్వు నుంచి రేవూరు పోయే దారిలో రైల్వే బ్రిడ్జి దాటిన తర్వాత హఠాత్తుగా ఆటోకు కుక్క అడ్డురావడంతో కుక్కను తప్పించబోయి ఆటోడ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆటో బోల్తాపడింది. ప్రమాద సమయంలో ఆటోలో 15మంది కూలీలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్సకోసం ఖమ్మం తరలించినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు డ్రైవర్ అతివేగం, సామర్థ్యానికి మించి ప్రయాణించటమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

డిండి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. డిండి వాగు నుంచి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ప్రతాప్ ఎనగర్ గ్రామం వద్ద అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాడ్గులపల్లి: మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆగామోత్కూర్ పాలేరు వాగు నుంచి డ్రైవర్లు వల్లపుదాసు గౌతమ్, అవిరెండ్ల నాగయ్య ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు, పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నల్లగొండ జిల్లాలో ఒకరు, సూర్యాపేట జిల్లాలో మరొకరు శనివారం దుర్మరణం చెందారు.


మధునాయక్(ఫైల్)

కొండమల్లేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు ఈ ఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గేటు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపిన ప్రకారం.. దేవరకొండ మండలం శేరిపల్లి పెద్దతండాకు చెందిన రమావత్ పత్య, మంగి దంపతుల చిన్న కుమారుడు రమావత్ మధునాయక్(33) దేవరకొండలోని అపోలో ఫార్మసీలో మెడికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యా పిల్లలతో దేవరకొండలో ఇల్లు అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తున్నాడు. దేవరకొండ నుంచి కొండమల్లేపల్లికి తన ద్విచక్ర వాహనంపై వచ్చి వెళుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కొండమల్లేపల్లి అపోలో ఫార్మసీ మూసి తిరిగి దేవరకొండకు వెళ్తుండగా మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గేటు సమీపంలో మధునాయక్ బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన మధునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్ నడుపుతున్న బీహార్ రాష్ట్రానికి చెందిన అనుసింగ్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మధునాయక్ భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ బండి మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రెడ్డి బజారుకు చెందిన పశ్య రామిరెడ్డి(75) శనివారం ఉదయం 11 గంటల సమయంలో పెట్రోల్ కొట్టించేందుకు స్కూటీపై వెళుతుండగా కోదాడ రోడ్డులోని బంక్ ఎదుట అతివేగంగా వస్తున్న కారును ఢీకొట్టడంతో రామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతన్ని 108లో ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళ కారు నడుపుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడు రామిరెడ్డి కుమారుడు పశ్య అనిల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


అక్రమ దత్తత చట్టరీత్యా నేరం

● సీడీపీవో చంద్రకళ


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న చంద్రకళ

వేములపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అక్రమ దత్తత చట్టరీత్యా నేరమని సీడీపీవో చంద్రకళ అన్నారు. శనివారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో మూడో కాన్పులో ఆడ శిశువు జన్మించడంతో అక్రమ దత్తత ఇచ్చారని వెలుగులోకి రావడంతో, ఆ ఇంటిని ఐసీడీఎస్ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎవరికైనా తమ పిల్లలను సాకడానికి ఇబ్బంది అయితే జిల్లా శిశు గృహానికి అప్పగించాలే కానీ విక్రయాలు, అక్రమ దత్తతకు ఇవ్వకూడదన్నారు. ఎవరైనా తమ సమీప బంధువులకు తప్ప ఇతరులకు దత్తత ఇవ్వరాదని, తమ సమీప బంధువులకు దత్తత ఇవ్వాల్సి వస్తే తమను సంప్రదిస్తే జిల్లా లీగల్ టీం, అధికారుల సమక్షంలో చట్టబద్ధంగా దత్తత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీసీపీయూ లీగల్ అడ్వయిజర్ వెంకన్న, కౌన్సిలర్ రజిని, వేములపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని తదితరులు పాల్గొన్నారు.

ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది



బీబీనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి బీబీనగర్ పట్టణంలో సాయంత్రం పశ్చిమతీరాన సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఆకాశం ఎర్రబడ్డది. మబ్బుల మధ్యన మసకబారుతున్న సూర్యుడి చివరి కాంతుల వెలుగులు ఆకాశం మీద కాంతి పటం వేసినట్లుగా తలపించింది. సాయంత్ర సమయం వస్తే చాలు ప్రకృతి తన అందాన్ని కొత్తగా ఆవిష్కరిస్తుందని చెప్పడానికి ఈ దృశ్యాలే నిదర్శనం.

ఆత్మహత్యాయత్నంపై ఆర్‌సీవో, అధికారుల విచారణ


విచారణ జరుపుతున్న ఆర్‌సీవో బలరాంనాయక్

దేవరకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ గిరిజన బాలికల పాఠశాలలో అక్టోబరు 31న విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై శనివారం విచారణ కొనసాగింది. ఎస్టీ గురుకులాల ఆర్‌సీవో బలరాంనాయక్ తోపాటు దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, సీఐ వెంకట్‌రెడ్డి వేర్వేరుగా గురుకుల పాఠశాలలో విచారణ జరిపారు. విద్యార్థిని ఆత్మహత్య యత్నానికి గల కారణాలను కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు టీచర్లు, తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నల్లగొండ ఆసుపత్రికి తరలింపు

దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థిని మాధవిని మెరుగైన చికిత్స కోసం శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆర్సీవో బలరాంనాయక్ తెలిపారు. విద్యార్థిని ఆరోగ్యం నిలకడగానే ఉందని, గొంతునొప్పి ఉండడంతో మెరుగైన వైద్యంకోసం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. విద్యార్థినికి ఎలాంటి హానిలేదని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రకాష్ తెలిపారు.

గురుకుల ప్రిన్సిపల్‌పై ఫిర్యాదు

దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మాలోతు కృష్ణ అనే విద్యార్థిని తండ్రి బిగినా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం బిక్యాతండాకు చెందిన మాలోతు కృష్ణ పెంచికల్‌పహాడ్ గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కాగా అక్టోబరు నెలలో విద్యార్థిని కృష్ణ తండ్రికి ఫోన్ చేసి డబ్బులు పంపించాలని కోరింది. కృష్ణ ఫోన్‌లో మాట్లాడుతుండగా చూసిన ప్రిన్సిపల్ ఆమెపై ఆగ్రహం వ్యక్తంచేసి టీసీ ఇచ్చి ఇంటికి పంపించినట్లు బిగినా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తన కుమార్తె భవిష్యత్ దెబ్బతింటుందని, తిరిగి పాఠశాలలో చేర్చుకునేలా చూడాలని కలెక్టర్‌ను కోరినట్లు బిగినా తెలిపారు. ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని సేవాలాల్ బంజార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందునాయక్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

ధ్యాన సాధనతో అద్భుతాలు

మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ తిరుపతి రావు


సదస్సులో మాట్లాడుతున్న తిరుపతిరావు

బీబీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధ్యాన సాధనతో విద్యావ్యవస్థలో నైతిక విలువలతో పాటు అద్భుతాలు సృష్టించ వచ్చునని మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ తిరుపతి రావు అన్నారు. శనివారం బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్ గ్రామంలోని బ్రహ్మకుమారీస్ సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో నిర్వహించిన విద్యావేత్తల సదస్సుకు ఆయనతో పాటు పలువురు వైస్ చాన్సలర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మూల స్తంభమైన విద్యావ్యవస్థలో పాఠశాలల నుంచి విశ్వ విద్యాలయం స్థాయివరకు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి కారణంగా అనేక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. దీనిని అధిగమించేందుకు ధ్యాన సాధన, నైతిక విలువలపై శిక్షణ, పరిష్కార మార్గాలవుతాయని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో రిట్రీట్ సెంటర్ డైరెక్టర్లు బీకే రాజకుమారి, బీకే సునీత పాల్గొన్నారు.

గోవుల వాహనం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కంటైనర్ వాహనంలో గోవులను అక్రమంగా తరలిస్తుండగా భజరంగ్‌దళ్ కార్యకర్తలు శనివారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఖమ్మం నుంచి జహీరాబాద్‌కు భారీ కంటైనర్‌లో 70 గోవులను తరలిస్తుండగా సమాచారం అందుకున్న భజరంగ్‌దళ్ కార్యకర్తలు పట్టణ కేంద్రంలోని వలిగొండ ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన గోవులను హైదరాబాద్ గోశాలకు తరలించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

వలిగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న పలువురిని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని వర్కట్‌పల్లి గ్రామపరిధిలో పబ్బు శంకరయ్య వ్యవసాయ క్షేత్రంలో అదే గ్రామానికి చెందిన ఆకుల మహేందర్, ఏర్పుల శ్రీశైలం, మీసాల శేఖర్, రాసాని దేవ, మీసాల ప్రసాద్ నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2430, ఐదు సెల్‌ఫోన్‌లు, నాలుగు టూవీలర్స్ స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

చింతలపాలెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రానికి మేడతి ఆంజనేయులు గత రెండు రోజులు కన్పించడంలేదు. ఊరికి వెళ్తున్నాని చెప్పి, ఇంటి నుంచి వెళ్లి ఆంజనేయులు తిరిగి రాకపోవడంతో అతని భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ జి. లక్ష్మయ్య తెలిపారు. అతని వివరాలు తెలిస్తే సెల్ 8712686047, 8712686010కు సమాచారం ఇవ్వాలన్నారు.

గురుకుల కళాశాల భవనంలోనే ప్రిన్సిపాల్ నివాసం

● ఫిర్యాదులు రావడంతో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

● నిజమని తేలడంతో ప్రిన్సిపల్‌పై ఆగ్రహం

బీబీనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తాను విధులు నిర్వహిస్తున్న గురుకుల ఎస్సీ బాలికల పాఠశాల, కళాశాల భవనంలోనే ప్రిన్సిపాల్ నివాసం ఉంటున్నారు. ఫిర్యాదులు రావడంతో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేపట్టి నిజమని తేలడంతో ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో శనివారం జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీబీనగర్ మండలకేంద్రంలో ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ తన కార్యాలయం పక్కనే ఓ గదిలో నివాస యోగ్యంగా మార్చుకుని కొన్ని సదుపాయాలు సమకూర్చుకుని ఇక్కడే నివాసముంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగి అయిన తన భర్త కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడికే వచ్చి వెళ్తుండడంతో దీనిని గమనించిన కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులుచేశారు. దీంతో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు శనివారం గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ కోసం వచ్చారు. ఫిర్యాదులపై అదనపు కలెక్టర్ ప్రిన్సిపాల్‌ను నిలదీయగా నిజం ఒప్పుకున్నారు. నివాసం ఉంటున్న గది వద్దకు వెళ్లి పరిశీలించగా, ఉండడానికి అవసరమైన సదుపాయాలను గమనించారు. దీంతో అదనపు కలెక్టర్ ప్రిన్సిపల్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. సాయంత్రం వరకు గదిని ఖాళీచేసి తన మొబైల్‌కు ఫొటోలు పెట్టాలని, లేదంటే చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



దోనియాలలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

కొండమల్లేపల్లి/పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం దోనియాల, పెద్దఅడిశర్లపల్లి మండలం మేడారం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలు, దోనియాలలో తెగిపోయిన కట్టలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో మొంథా తుఫాన్ రైతులను నష్టపర్చిందని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో చాలా చోట్ల తుఫాను కారణంగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.10వేలు ప్రకటించడం సరికాదని అన్నారు. ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు సన్నరకం వరి ధాన్యానికి రూపాయలు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిందే కాని ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు ఇవ్వలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఫసల్ బీమా చేయిస్తే ఎలాంటి నష్టం జరిగిన ఇన్సూరెన్స్ ద్వారా డబ్బులు వచ్చేవని అన్నారు. తుఫాన్ వచ్చి వారం రోజులవుతున్న ఇప్పటి వరకు పంట నష్టాన్ని అంచనా వేయకపోవడం సరికాదని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో వరి, 70 వేల ఎకరాల్లో పత్తి పంట నష్టపోయిందన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీసం పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదని అన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క వెంకటేష్‌యాదవ్, దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏటీకృష్ణ, జిల్లా కార్యదర్శి వానం నరేందర్‌రెడ్డి, లాలునాయక్, జంగిడి మల్లేష్, వరికుప్పల వెంకటయ్య, లాలునాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వట్టిపు గోవర్ధన్, వలసాని రామలింగం, రమేష్, శ్రీను,వెంకట్, శ్యామ్, రాంబాబు, నరేందర్, అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల ఉమ్మడి జిల్లా బేస్‌బాల జట్ల ఎంపిక పోటీలను శనివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి బాల, బాలికలు హాజరై క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన క్రీడాకారులను విజేతలుగా ప్రకటించారు. 100 మంది బాల, బాలికలు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్ల శ్రీనివాస్, బొమ్మపాల గిరిబాబు, నుస్రత్ సుల్తానా, సుజాత, పృథ్వీ, ప్రణీత్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం చూడాలి

● జడ్పీ సీఈవో శ్రీనివాసరావు



ఈదులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

కట్టంగూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం తప్పకుండా పరిశీలించాలని, కొలతల్లో ప్రామాణికతను పాటించాలని నల్లగొండ జడ్పీ సీఈవో శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఈదులూరు, నారగూడెం గ్రామాలలోని ఐకేపీ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరిపడా వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు ఇబ్బందులు పడ్డారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మ్యాచర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, ఏపీఎం రాములుతో పాటు వ్యవసాయ అధికారులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత యానాల



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ సామాజిక సేవలు, గాంధేయ నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించి రానున్న తరానికి జాతీయ నాయకుల చరిత్రను వారి ప్రాముఖ్యతను అందించడంలో విశేషంగా కృషి చేస్తున్న సేవల గుర్తింపుగా గాంధేయవాద సంస్థల ప్రతినిధి యానాల ప్రభాకర్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. లీడ్ ఇండియా, ట్రస్మా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అందించడానికి ప్రభాకర్‌రెడ్డి జాతీయ నాయకుల చరిత్ర త్యాగాలను నేటి విద్యార్థులకు అందించేందుకు అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రావడం మరింత బాధ్యతను పెంచిందన్నారు.

సాగర్ 10 గేట్ల ద్వారా నీటి విడుదల

● 589.80 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం



సాగర్ ప్రాజెక్టు 10 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 589.80 అడుగులుగా (311.4474టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,982 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 3,088 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్లల్లో 10 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 80,970 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,17,860 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 1,17,860 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. ఎడమ, వరద కాల్వలకు, ఎస్ఎల్‌బీసీకి నీటి విడుదలను నిలిపివేశారు.

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగుతుంది. శనివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 13353.61 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా అధికారులు ప్రాజెక్టు 5 క్రస్టుగేట్లను ఎత్తి 12157.10 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.70అడుగులు(4.12టీఎంసీలు)గా ఉంది.

నేరవేరని రైతు వేదికల లక్ష్యం

● కానరాని రైతు సదస్సులు.. ● నిరుపయోగంగా రైతు వేదికలు

మోటకొండూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పంటలు సాగేచేసే రైతులకు సలహాలు, సూచనలు, సాగులో ఆధునిక పద్ధతులు వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించేందుకు గత ప్రభుత్వం 2020 - 2021లో ప్రతీ రైతు వేదికకు ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా రూ.12లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలు కేటాయించి రైతు వేదికలను నిర్మించింది. కానీ వాటి నిర్వహణపై అధికారులు పట్టించుకోకపోవడంతో రైతు వేదికలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. 5000హెక్టర్లకు ఒక్కో క్లస్టర్ చొప్పున మండలంలో మోటకొండూరు, చాడ, చందేపల్లి, మాటూరు గ్రామాల్లో నాలుగు రైతు వేదికలను నిర్మించారు. అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ లక్ష్యం నేరవేరడం లేదు. దీంతో అన్నదాతలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు.

రైతు వేదికల్లో కనీసం తాగునీరు, మురుగుదొడ్లు, ప్రహరీగోడలు లాంటి వసతులు లేకపోవడంతో రైతులకు, అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల రైతు వేదికలకు తాళం వేసి వదిలేశారని, వాటిని పట్టించుకోవడం మరచిపోయారని అందులోని ఫర్నిచర్, కుర్చీలు దుమ్ముధూళితో దర్శనమిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.



మోటకొండూరులో గ్రామానికి దూరంగా పంటపొలాల మధ్యన నిర్మించిన రైతు వేదిక

సమావేశాల నిర్వహణేదీ?

రైతులకు సంకేతిక పరిజ్ఞానం పెంపొందించేదుకు రైతులతో సమావేశాలు నిర్వహించి, సాగు చేసే పంటలపై శాస్త్రవేత్తల సలహాలు, మెళకువలు, సాగు పద్ధతులు, పంటల తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశాలు నిర్వహించి రైతులకు వివరించాలి. కానీ సమావేశాలు ఏర్పాటు చేయకుండా పొలాల వద్దకు వెళ్లి రైతులకు తగు సూచనలు ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

నిర్వహణ కరువు

రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నెలకు రూ.9వేల చొప్పున నిధులు ఇస్తోంది. వాటిని కరెంట్ బిల్లు, స్టేషనరీ ఆన్‌లైన్ ఖర్చుల నిమిత్తం ఉపయోగించాలని ప్రభుత్వం సూచించింది. రైతు వేదికలు నిర్మించినప్పటి నుంచి నాలుగు నెలలు మాత్రమే నిధులు వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఆయా రైతు వేదికల్లో చెత్త పేరుకుపోతోంది. దాదాపు ఏడాది నుంచి నిధులు ఇవ్వకపోవడంతో రైతు వేదికలను తామే శుభ్ర పరుచుకుంటున్నామని, దీంతో నిర్వహణ భారంగా మారిందని ఏఈవోలు వాపోతున్నారు. ప్రతీ రైతు వేదికకు ఒక వాచ్‌మన్, స్వీపర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలోని రైతు వేదికలో విద్యుత్, మరుగుదొడ్లు, నీటి వసతి లేకపోవడంతో రైతులు, అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పలు రైతు వేదికల్లో మరుగు దొడ్లు ఉన్నా నీటి సౌకర్యం లేదు. రైతు వేదికల్లో ఏర్పడిన అసౌకర్యాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

-రమాదేవి, ఏవో, మోటకొండూరు

గ్రామానికి దూరంగా...

మోటకొండూరు మండల కేంద్రంలో నిర్మించిన రైతువేదిక గ్రామానికి దూరంగా నిర్మానుష్య ప్రాంతంలో నిర్మించారు. ఈ రైతు వేదిక వద్దకు వెళ్లేందుకు దారి కూడా సరిగా లేకపోవడంతో పంట పొలం మధ్య నుంచి వెళ్లాల్సి వస్తోంది. చిన్న వర్షం పడితే చాలు దారి మొత్తం చెరువును తలపించడంతో పాటు బురదమయం కావడంతో అటు రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

కొన్నిచోట్ల రైతు వేదికలు జనావాసాలకు దూరంగా ఉండటం, వాచ్‌మన్ లేకపోవడంతో రాత్రి వెళల్లో ఆకతాయిలకు అడ్డాలుగా మారాయని పలువురు పేర్కొంటున్నారు.

వైభవంగా మత్స్యగిరిస్వామి ధ్వజారోహణం

వలిగొండ, నవంబరు1(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి గుట్టపైన స్వామివారి బ్రహ్మోత్సవాలు గరుడధ్వజ ప్రతిష్ఠ, పల్లకి ధ్వజారోహణ, బలిప్రదానం, దేవతాహ్వానం, హోమం, భేరీ తాండవంతో శనివారం శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మత్స్యగిరి కొండపై సందడి నెలకొంది. యాగశాలకు ద్వార తోరణార్చన జరిపి ఆగమ శాస్త్రరీతిలో బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణ ఘట్టం జరిగింది.ముక్కోటి దేవతలను ఆహ్వానించడానికి మహావిష్ణువు వాహనమైన గరుడ్మంతుడిని ఆహ్వానించడానికి ధ్వజారోహణ తంతును అర్చకులు జరిపారు. స్వామివారి గర్భాలయం ముందు గరుడ్మంతుని చిత్రపటం వేసి అందంగా మనోహరంగా అలంకరించారు..గరుడ పతాకాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేశారు. కార్యక్రమం రుత్వికులు వేద పండితులు అర్చకుల మంత్రోచ్చరణ నాదస్వర సప్తరాగాల నడుమ సాగింది. ఈ నేపథ్యంలో గరుడిని ఆహ్వానించడానికి గరుడ ముద్దను ఎగురవేశారు. భక్తులు గరుడ ముద్దకు పోటీ పడ్డారు. ఈ గరుడ ప్రసాదం స్వీకరిస్తే సౌభాగ్యం, సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్‌రెడ్డి, దేవాలయ ఈవో మోహన్‌బాబు, ధర్మకర్తలు కొడితాల కరుణాకర్, బండి రవి, ఈతా పరాములు, ప్రధానఅర్చకులు ప్రతాపురం శ్రీనివాసాచార్యులు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి పల్లకిసేవలో దేవస్థాన పాలకమండలి

యాదగిరీశుడికి వైభవంగా లక్ష పుష్పార్చన



ఆలయంలో పుష్పాలంకరణలో ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు

యాదగిరిగుట్ట, నవంబరు 1(ఆంధ్యజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో శనివారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. గంటపాటు పూజాపర్వం కొనసాగింది.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేపట్టారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.39,50,375 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో ఎస్.హరీష్ తెలిపారు. కాగా, హైకోర్టు జడ్జి కె.సృజన కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేయగా పండితులు వేద ఆశీర్వచనం చేశారు. కొండకింద సత్యదేవుని వ్రతాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

యాదగిరి మాస పత్రిక ఆవిష్కరణ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట క్షేత్ర మహాత్మ్యాన్ని యాదగిరి మాస పత్రిక ద్వారా భక్తలోకం తెలుసుకునే సులువైన మార్గమని దేవాదాయశాఖ డైరెక్టర్, ఇన్‌చార్జి ఈవో ఎస్.హరీష్ అన్నారు. స్వామివారి ఆలయంలో శనివారం మాసపత్రిక ఎడిటర్ ఈశ్వర్ కుమార్‌తో కలిసి మూడో మాస పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. వారి వెంట ఆలయ ప్రధానార్చకుడు సురేంద్రాచార్యులు ఉన్నారు. కార్తీకమాసంలో భాగంగా శనివారం 1,080 జంటలు వ్రతాలు జరిపించారు. ప్రతీవారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా శివశక్తి కూచిపూడి ఆర్ట్స్ (హైదరాబాద్) అకాడమి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

నేటినుంచి భువనగిరి ఉర్సు



ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్‌చిస్తి

భువనగిరి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన భువనగిరి ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని పలు దర్గాల్లో ఈ నెల 17వ తేదీ వరకు ఉర్సు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి దర్గాలో 2,3 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్‌చిస్తి శనివారం ఏర్పాట్లు పరిశీలించారు. మునిసిపల్, పోలీస్ అధికారులు, నిర్వాహకులు, నాయకులతో కలిసి పలు దర్గాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.

ఉత్సవాలు ఇలా..

2న గంజ్ మజీద్‌లో గంధం ఊరేగింపు, 3న దీపారాధన, 4న హైదరాబాద్ చౌరస్తా ఈద్గాలో, 5న ఖాజీమహల్లా జమాల్ ఉల్ బహేర్ దర్గాలో గంధం ఊరేగింపు, 6న దీపారాధన, అదే రోజు కిసాన్‌నగర్‌లో హజ్రత్ బురహానుద్దీన్ అవులియా దర్గాలో గంధం ఊరేగింపు, 7న దీపారాధన, 8న హైదరాబాద్ చౌరస్తాలోని హజ్రత్ సోంటే పీర్ దర్గాలో గంధం ఊరేగింపు, 9న దీపారాధన, అదే రోజు సమద్ చౌరస్తాలోని లాల్‌షా వలి దర్గాలో గంధం ఊరేగింపు, మరుసటి రోజు దీపారాధన నిర్వహించనున్నారు. అలాగే దర్గాల్లో రోజువారీగా ప్రత్యేక నమాజులు, పలు దర్గాల్లో అన్నదానం నిర్వహించనున్నారు.

డీసీఎంఎస్ ఎత్తివేత వైపు అడుగులు

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుకూలంగా అడుగులు వేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో 1987లో డీసీఎంఎస్‌లు ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్రాల్లో కార్యాలయంతో పాటు, గోదాములు నిర్మించారు. భువనగిరి పట్టణంలో మాత్రం దుకాణాల సముదాయం నిర్మించారు. మొదట్లో డీసీఎంఎస్‌ల ద్వారా విత్తనాలు విక్రయించడంతో పాటు ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. అయితే ఇవి డీసీఎంఎస్ అభివృద్ధికి ఏమాత్రం తోడ్పాటు ఇవ్వలేదు. దీనికి తోడు డీసీఎంఎస్ ఆస్తులు దుర్వినియోగం కావడం వివాదాస్పదంగా మారిన ఘటనలు ఉన్నాయి. అదే విధంగా డీసీఎంఎస్‌కు, డీసీసీబీతో పాటు పాలకవర్గం పొడిగింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. డీసీఎంఎస్ చైర్మన్, డైరెక్టర్ల నియామకం, గౌరవ వేతనం, వాహనాలు, ఇంటి అద్దెల చెల్లింపు ప్రభుత్వానికి భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డీసీఎంఎస్ మూసివేతకు రాష్ట్ర సహకార శాఖ ప్రతిపాదనలు రూపొందిస్తోంది.

రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేని డీసీఎంఎస్

నాగార్జున జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీతో రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి ఎరువులు, విత్తనాలు సరఫరా చేసినా వాటిని రైతులకు సరైన సమయంలో విక్రయించడంలో వైఫల్యం చెందింది. అదేవిధంగా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించకపోవడం, దీనికి తోడు ధాన్యం కొనుగోలు చేసినా, సకాలంలో కమిషన్ డీసీఎంఎస్‌కు రాకపోవడంతో ఆర్థికంగా దివాలా తీసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆస్తులను కాపాడేందుకు సరైన యంత్రాంగం లేకపోవడంతో డీసీఎంఎస్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి నెలకొంది. డీసీఎంఎస్ స్థలాలు, మడిగలను పాలకవర్గాలతో పాటు, అధికారులు కూడా కాపాడలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆస్తులపై కోర్టులకు వెళ్లడం జరిగింది.

కొత్తగా పోస్టుల భర్తీ చేయకపోవడం, ఉన్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు, తాత్కాలిక ఉద్యోగులకు సైతం వేతనాలు చెల్లించకపోవడం సమస్యగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో డీసీఎంఎస్‌ను మూసి వేయడమే సమంజసమనే భావన వ్యక్తం అవుతోంది. రైతులకు ఎలాంటి ప్రయోజనం లేని డీసీఎంఎస్‌ను రద్దు చేయడమే మేలనే అభిప్రాయానికి ప్రభుత్వం రావడంతో పాటు ఆ వైపుగా చర్యలు ప్రారంభించింది.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్సీ



వేములపల్లిలో నేలవాలిన పొలాన్ని రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సత్యం

వేములపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండల కేంద్రం శివారులో తుఫాన్ ధాటికి నేలవాలిన పంట పొలాలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షంతో వేలాది మంది రైతులు పంట నేలవాలిందని, జాతీయ విపత్తుగా ప్రకటించి ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందించాలని కోరారు. ఇప్పటికే రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికందుతున్న దశలో పంట నేల పాలు కావడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు, శక్తులకు సబ్సిడీ రూపంలో కోట్లాది రూపాయలు అందిస్తున్నాయే కానీ ప్రకృతి విపత్తుతో నష్టపోయిన రైతులకు మాత్రం సకాలంలో పరిహారం అందించి ఆదుకోకపోవడం బాధాకరమన్నారు. ఇంతటి విపత్తు కొనసాగుతున్నప్పటికీ వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయకపోవడం రైతుల పట్ల వారికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జిల్లా వ్యవసాయ యంత్రాంగం క్షేత్రస్థాయిలో ప్రతి ఎకరాకు జరిగిన నష్టాన్ని రైతు వారీగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజాల రామచంద్రం, సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, సీపీఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

సురేంద్రపురిలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

భువనగిరిరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం వడాయిగూడెం శివారులో గల సురేంద్రపురి పంచముఖ హనుమాన్‌దీశ్వర ఆలయంలో సోమవారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు కార్తీకమాస బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ నర్సింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న పంచముఖ ఆంజనేయస్వామికి మూలమూర్తికి పంచామృత నిజాభిషేకం, విష్ణ్వేశ్వరపూజ, పుణ్యాహవాచనం, 4న వేంకటేశ్వరస్వామి మూలమూర్తికి, 5న పంచముఖి పరమేశ్వర స్వామి మూలమూర్తికి పంచామృత నిజాభిషేకం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్వర్ణగిరిలో ఏకాదశి పూజలు



స్వర్ణగిరిలో హోమ పూజలు చేస్తున్న అర్చకులు

భువనగిరి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలో స్వర్ణగిరి క్షేత్రంలో శని వారం ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని సువర్ణ బిందెల తీర్థంతో అభిషేకించారు. అభయాంజనేయ స్వామికి ఆకు పూజలు చేశారు. శ్రీవారి నిత్య కల్యాణం కన్నుల పండుగగా చేపట్టారు. జల నారాయణుడికి హారతి పూజలు నిర్వహించారు. దేవతామూర్తులను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి అన్న ప్రసాదం స్వీకరించారు.

రేపటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

శాలిగౌరారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మాదారం గ్రామ శివారులోని టీఆర్ఆర్ కాటన్ మిల్‌లో నవంబరు 3 నుంచి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు నిర్వహించనున్నట్లు శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రైతులు 8 నుంచి 12 తేమ శాతం గత పత్తిని తీసుకురావాలని కోరారు. 12శాతం కంటే ఎక్కువ ఉన్న పత్తిని రిజెక్ట్ చేయనున్నట్లు తెలిపారు. నాణ్యమైన పత్తిని తీసుకురావాలని అన్నారు.

నేటి నుంచి అమ్మవారి చీరల వేలం

నల్లగొండకల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం సరస్వతి అమ్మవారికి, మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఈ నెల 2నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కుశలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంపాట ప్రతీరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల భక్తులు వేలంపాటలో పాల్గొనాలని, వివరాలకు 9949515513 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

- నేలకు ఆనుకొనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- ఫెన్సింగ్ ఏర్పాటు చేయని విద్యుత్ శాఖ
- ఆందోళనకు గురవుతున్న బాటసారులు


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడిగేదె (ఫైల్)

నల్లగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో దారిన పోయేవారు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవలే ఓ పాడి గేదే విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. అయినా అధికారుల్లో చలనం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో లేదు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో రేణుకా ఎల్లమ్మ దేవాలయం వెనుక మర్రిగూడెం పోయే దారిలో నేలకు ఆనుకునే విధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అప్పట్లోనే చిన్న దిమ్మపై కట్టడంతో సీసీ రోడ్డు వేయడం వల్ల ఆ ట్రాన్స్‌ఫార్మర్ నేలకు ఆనుకునే విధంగా ఉంది. చిన్నపిల్లలు తెలియక ఆ ట్రాన్స్‌ఫార్మర్ ముట్టుకుంటే ప్రమాదానికి గురి అవకాశాలు ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. స్థానికులు అనేక సార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా, లైన్‌మన్, హెల్పర్‌కు చెప్పినా కూడా ఏమాత్రం స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన కరెంటు తీగలు మొత్తం రోడ్డు వైపే ఉన్నాయి. వాటిని ప్రమాదం లేకుండా చేయాల్సిన యంత్రాంగం స్పందించడం లేదు.

కనీసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయని పరిస్థితి

రోడ్డు వెంట నేలకు తాకే విధంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనీసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సుమారు రూ.1.20 లక్షల విలువైన ఒక పాడి గేదె ఇదే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. దీంతో ఆ కుటుంబానికి ఆర్థికంగా నష్టం వాటిల్లింది. ఇకపోతే అదే దారిలో పిల్లలతో పాటు బాటసారులు వెళ్తుంటారు. అదేవిధంగా స్కూల్ పిల్లలు కళాశాల విద్యార్థులు ఆ రోడ్డు వెంట నిరంతరం వెళ్తుంటారు. అనుకోకుండా ఏదైనా దుర్ఘటన జరిగితే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఫెన్సింగ్ లేకపోవడంతో దారిన వెళ్లే వాళ్లు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. వర్షం వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ పెద్ద దిమ్మపై ఏర్పాటు చేయాలని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదే చనిపోయింది:



ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రూ.1.20లక్షల విలువైన తమ పాడి గేదె చనిపోయింది. అనేక సార్లు ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని దిమ్మపై పెట్టాలని చెప్పినా కూడా పట్టించుకోవడం లేదు. కరెంటు వాళ్లకు చెప్పినా కూడా స్పందించడం లేదు. ప్రజలు ప్రమాదానికి గురై అవకాశాలు ఉన్నాయని చెప్పినా కూడా పెద్ద దిమ్మె ఏర్పాటు చేయడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ నేలకు ఆనుకునే విధంగా ఉంది.

- అండాలు, మర్రిగూడ

తక్షణమే అధికారులు స్పందించాలి



అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మపై ఏర్పాటు చేయాలి. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలి. విద్యుత్ శాఖ అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. ప్రమాదం పొంచి ఉందని చెప్పినా స్పందించడం లేదు. దారిన వెళ్లే ప్రజలకు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలి.

- బొజ్జ దేవయ్య, మర్రిగూడ

విద్యార్థులకు చేయూత

మర్రిగూడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల విద్యార్థులకు విక్టరీ యూత్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ఉపాధ్యాయులు యూత్ సభ్యులు కలిసి టై బెల్ట్, ఐడీ కార్డు, షూస్, క్రీడా దుస్తులు రొక్కం భాస్కర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల వద్దు, ప్రభుత్వ పాఠశాల ముద్దు తలదించుకొని పుస్తకం చదివితే మనల్ని తల ఎత్తుకునేలా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, ముద్దం శ్రీధర్, మేగావత్ చందు నాయక్, వెంకటేష్, కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్


ఈదులూరులో మాట్లాడుతున్న సాగర్

కట్టంగూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విప్లవ ఉద్యమంలో అనేక మంది విప్లవ యోధుడు, విప్లవ కార్యకర్తలు నవంబర్ మాసంలోనే అమరులైయ్యారని, వారు అందించిన స్ఫూర్తి భవిష్యత్తు తరాలకు ఆదర్శం కావాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నల్లగొండ జిల్లా కార్యదర్శి సాగర్ అన్నారు. విప్లవవీరుల సం స్మరణ సభలను నవంబరు 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలని న్యూడెమోక్రసీ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం మండలంలోని ఈదులూరు గ్రామంలో బూరుగు అంజయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన ఎర్రజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అమరవీరులు అందించిన విప్లవస్ఫూర్తితో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, యువత ఉద్యమాల వైపు ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు బూరుగు సత్తయ్య, వీరాంజనేయులు, ఎస్‌కె.జాహీదా, అంజయ్య, దండెంపల్లి లింగయ్య, జయప్రకాష్, గద్దపాటి పాపయ్య, ముత్తయ్య, వెంకయ్య, సత్తయ్య, లక్ష్మమ్మ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తడిసిన పత్తిని కోనుగోలు చేయాలి

చిట్యాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తడిసిన, రంగు మారిన పత్తిని కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో మార్కెట్ కార్యదర్శి జానయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం వల్ల పత్తి పంట బాగా దెబ్బతిన్నదని, అక్కడక్కడా ఉన్న పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. నాణ్యతా నిబంధనలు సడలించాలని, అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్‌కే షరీఫ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శాలిగౌరారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశువుల వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి శరణ్య అన్నారు. శాలిగౌరారం మండలం రామాంజపురం గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు టీకాల శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పశువుల, గొర్రెల షెడ్లను ప్రతీ రోజు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉపేందర్, జానీ, విజయకుమారి, గోపాల మిత్రలు గండూరి విజయలక్ష్మి, మైత్రి, రామచంద్రు, మహేష్, వేముల శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాంపల్లి మండలంలో కురిసిన వర్షం

- ఆందోళనలో రైతులు


నాంపల్లి మండలం తుమ్మలపల్లిలో వర్షానికి నెలకొరిగిన వరి పంట

నాంపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండలంలో 3400 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా ఇటీవల కురిసిన వర్షాలకు 800 ఎకరాల వరకు వరి పంట, 2200 ఎకరాలలో పత్తి పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి బండారు శివ తెలిపారు. మండలంలోని తుమ్మలపల్లి, రెవెల్లి, పసునూరు, ముష్టిపల్లి, దామెర, నాంపల్లి, నల్లపురాజుపల్లి, తిరుమలగిరి గ్రామాల్లో వరి పంట దెబ్బతిన్నది. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిహారం అందజేయాలని తుమ్మలపల్లికి చెందిన బాధిత రైతు గోన హనుమంతరావు ప్రభుత్వాన్ని కోరారు. తనకు ఉన్న రెండు ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తి శ్రద్ధలతో ఏకాదశి హోమం


కట్టంగూరులో హోమంలో పాల్గొన్న మహిళలు

కట్టంగూరు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో తృతీయ ఏకాదశి మహా యజ్ఞాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి రామడుగు శ్రీనివాస్ శర్మ, రామడుగు అశ్వినిశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి లక్ష్మయ్య మంగమ్మ దంపతులతో పాటు రెడ్డిపల్లి వెంకటమ్మ, శోభ, అలివేలు, కృష్ణవేణి, మణెమ్మ, లక్ష్మీ, పద్మ, పూలమ్మ, ఇందిరమ్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శిశువిక్రయాలు, లింగవివక్షపై అవగాహన


అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీలత

మర్రిగూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుదాభక్ష్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బండకింది తండా, యరగండ్లపల్లి గ్రామంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు, తల్లులకు శిశువిక్రయాలు, లింగవివక్ష, అక్రమదత్తతపై అవగాహన కల్పించారు. మొదటి కాన్పులో పాప ఉండి, రెండ, మూడవ గర్భిణులకు ఆడపిల్లలు పుట్టినప్పుడు అమ్మడం గాని కొనడం చట్టరీత్యా నేరమని అన్నారు. వారికి చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగవివక్షత చూపొద్దని ఆడ, మగ అందరూ సమానమని అన్నారు. ఒక వేళ శిశువులను విక్రయిస్తే అమ్మిన, కొన్న వారికి జైలుశిక్ష విధిస్తారని అన్నారు. ప్రభుత్వం దత్తత కార్యక్రమాన్ని ఏ విధంగా అమలు చేస్తుందో గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.శ్రీలత, యశోద, ఏఎన్ఎం సునీత, ఆశావర్కర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అళ్వార్‌స్వామి స్ఫూర్తిగా మరో గ్రంథాలయ ఉద్యమం

- గ్రంథాలయం ఉద్యమకారుడు కస్తూరి ప్రభాకర్

శాలిగౌరారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పుస్తకాలను సామాన్యులకు చేరువ చేయడానికి గొప్ప గ్రంథాలయ ఉద్యమం నడిపిన రచయిత, సామాజిక ఉద్యమకారుడు వట్టికోట అళ్వార్‌స్వామి స్ఫూర్తిగా మరో గ్రంథాలయ ఉద్యమం రూపుదిద్దుకుంటుందని గ్రంథాలయ ఉద్యమకారుడు కస్తూరి ప్రభాకర్ అన్నారు. వట్టికోట జయంతి నుంచి వర్ధంతి దాకా పుస్తకపఠనం అనే నినాదంతో శనివారం వట్టికోట జన్మస్థానమైన శాలిగౌరారం మండలం మాదారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ బెల్లి యాదయ్య మాట్లాడుతూ పుస్తకం చదవడం వల్లే సామాన్యులు సైతం మహనీయులుగా ఎదిగారన్నారు. విజ్ఞానదాయకమైన పుస్తకాలను నిరంతరం చదవాలని ఆకాంక్షించారు. ప్రజా వాగ్గేయకారుడు అంబటి వెంకన్న మాట్లాడుతూ వట్టికోట అల్వార్‌స్వామి స్ఫూర్తితో గ్రంథాలయాల ఏర్పాటును ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమకారుడు శీలం అవిలేను, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బైరబోయిన వెంకటేశం, మామిడి సర్వయ్య, మాదారం హైస్కూల్ హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు మోత్కూరి శ్రీనివాస్, బండారు శంకర్, మామిడి లింగస్వామి, మహేందర్ పాల్గొన్నారు.

● వట్టికోట అళ్వార్‌స్వామి అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలిగౌరారంలోని జడ్పీ హైస్కూల్‌లో వట్టికోట అల్వార్ స్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. అల్వార్ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కోట మల్లయ్య, ఉపాధ్యాయులు పొలగోని వెంకటేశ్వర్లు, వి.రామచంద్రయ్య, కె.సైదులు, డి.అశోక్‌కుమార్, కె.లింగయ్య, వి.శోభ ఉపాధ్యాయులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాంతో అధిక దిగుబడులు


రైతులకు ఆయిల్‌పాంపై అవగాహన కల్పిస్తున్న రవీందర్‌రెడ్డి

శాలిగౌరారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పాంతో అధిక దిగుబడుల తో పాటు రాబడి కూడా అధికంగా ఉంటుందని పతంజలి ఆయిల్ పాం కంపెనీ నల్లగొండ జిల్లా సీనియర్ మేనేజర్ నర్రా రవీందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని వ్యవసాయ మార్కెట్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పాం సాగుపై రైతులను చైతన్య పరిచేందుకు ప్రభుత్వం అధిక మొత్తంలో ప్రోత్సాహకాలు అందిస్తుందని అన్నారు. ఆయిల్‌పాం పంట ద్వారా ప్రతీ నెలా రైతులకు ఆదాయం అందుతుందని అన్నారు. ఉద్యానపంటల్లో ఆయిల్‌పాం పంటకు ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని పేర్కొన్నారు. నీటి వసతి ఉన్న ప్రతీ రైతు ఆయిల్‌పాం సాగు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పతంజలి కంపెనీ సీనియర్ ప్లాంటేషన్ ఆఫీసర్ నేలపట్ల నరేందర్, శాలిగౌరారం ఫీల్డ్ అసిస్టెంట్ కట్టగూరి శ్రీను పాల్గొన్నారు.

4వ తేదీ వరకు గుర్తింపు పత్రాలను అందించాలి

నల్లగొండ కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్పోర్ట్స్ అసోసియేషన్లకు సంబంధించిన గుర్తింపు పత్రాలను సమర్పించాలని డీవైఎస్‌వో అక్బర్ అలీ కోరారు. స్పోర్ట్స్ అసోసియేషన్లకు సంబంధించిన బైలాస్, స్టేట్ అసోసియేషన్ వారు ఇచ్చిన గుర్తింపు పత్రం, అసోసియేషన్ల రిజిస్ట్రేషన్ల పత్రాలు, ఎన్నికలు జరిగిన కమిటీ సభ్యుల వివరాలను ఈ నెల 4వ తేదీలోగా జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు వివరాలు పంపాలని కోరారు. ఇతర వివరాలకు 9866317321 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- బీజేపీ జిల్లా నాయకుడు రామరాజుయాదవ్


జీఎడవల్లి సమీపంలో రోడ్డు పక్కన ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడుతున్న రామరాజు

కనగల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని బీజేపీ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని జీఎడవల్లి ఐకేపీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. వర్షం నీట మునిగి రంగుమారిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐకేపీ సిబ్బంది అధికారులు అవగాహనరాహిత్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తక్కువ స్థలంలో ఏర్పాటు చేశారని విమర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు అందులోకి వరద నీరుచేరి ధాన్యం రాశులు నీట మునిపోగా రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. తేమ, తరుగు పేరుతో రైస్ మిల్లు యజమానులు కోతలు పెడుతున్నారని ఆరోపించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రంగుమారిన ప్రతీ గింజను కాంటావేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంట నాయకులు పిండిపాపిరెడ్డి, తిరందాసు కనకయ్య, పర్సనబోయిన బిక్షం, నీలకంఠం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబరు 12ను తక్షణమే సవరించాలి

భవన నిర్మాణ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కనగల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు పథకాలను ప్రైవేటుపరం చేయడానికి తీసుకొచ్చిన జీవో నెంబరు 12ను తక్షణమే సవరించాలని తెలంగాణ భవన నిర్మాణ వర్కర్స్ పెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) మండల మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రజాపాలన చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను కాజేసేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. భవన నిర్మాణ వర్కర్స్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లెపల్లి వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కానుగు లింగస్వామి, దాసరి నర్సింహ, ధనలక్ష్మి, యాదయ్య, శంకర్, కృష్ణయ్య, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాలు విజయవంతం చేయాలి



చెకుముకి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుకన్య

నకిరేకల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెకుముకి సైన్స్ సంబరాలు 2025ను విజయవంతం చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుకన్య, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి కోరారు. నకిరేకల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం చెకుముకి సైన్స్ సంబరాలు 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకే కృషి చేస్తున్నామన్నారు. సైన్స్ ప్రావీణ్యత సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలన శక్తిని రేకెత్తించడానికి సైన్స్ అధ్యాయాన్ని ప్రోత్సహించడానికి శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి శాస్త్రవేత్తగా ఎదగడానికి తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కన్వీనర్ వంటెపాక నగేష్, డివిజన్ కార్యదర్శి బుడిగె సుధాకర్, ఉపాధ్యాయులు యాదగిరి, మమత, అరుణ తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక సాయం అందజేత

మర్రిగూడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన అబ్బనబోయిన మంగమ్మ కుమారుడు రమేష్ అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం కాంగ్రెస్ పార్టీ నాయకులు అయితగోని వెంకటయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో మేతరి శంకర్, అబ్బనబోయిన నాగరాజు, సత్తయ్య, చాపల గణేష్, శ్రీకాంత్, వావిళ్ల వెంకటయ్య పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలి


అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో


నల్లగొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ తోడ్పడాలని మండల ఎంఈవో కత్తుల అరుంధతి అన్నారు. మర్రిగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పీఏ, పూర్వఉపాధ్యాయుడు ఎదుళ్ల మధుసూదన్‌రెడ్డి-జ్యోతి దంపతులు సహకారంతో శనివారం ఏర్పాటు చేసిన అల్పాహారం , సాయంత్రం స్నాక్స్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహకారంతో ఈ విద్యా సంవత్సరం వరకు విద్యార్థులకు అల్పాహారం, స్నాక్స్ అందించడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బత్తుల భాస్కర్, ఉపాధ్యాయులు బండ రమేష్‌రెడ్డి, సుప్రేమ, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చండూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీలో ఉన్న 30 మంది నిరుపేదలకు గాంధీజీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా నిత్యావసర సరుకులు చండూరు ఎంఈవో సుధాకర్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ధనికులు చాలా మంది ఉంటారని, కానీ సేవా గుణం అందరికీ ఉండదన్నారు. గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 23 నెలలుగా పలు సేవా కార్యక్రమాల ద్వారా అభాగ్యులకు ఆసరాగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ భార్గవ్, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న ఎంఈవో సుధాకర్‌రెడ్డి, కోడి శ్రీనివాసులు

డీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి


పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌తో లింగంగౌడ్

నల్లగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం బీసీ కులాలు కష్టపడుతున్నాయని, పదవులు మాత్రం వేరే సామాజిక వర్గానికి ఇస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తాము ఏనాడు పార్టీలో పదవి ఆశించకుండా పనిచేశామని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉన్నందున జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.4
ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 2 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.80 (311.4474)	1,17,860	1,17,860
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	13,353.61	12,157.10
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	1,27,975	1,37,160

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

డీసీఎంఎస్ ఎత్తివేత వైపు

అడుగులు



నాగార్జున జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ను ఎత్తివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. డీసీఎంఎస్ అవసరం లేదనే అభిప్రాయానికి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇతర కార్పొరేషన్లలో విలీనం చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించింది. వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న డీసీఎంఎస్ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ నేపథ్యంలో విలీనం లేదా, రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- దివాలా అంచున మార్కెటింగ్ సొసైటీ
- ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి
- ఉమ్మడి జిల్లాలో రూ.100కోట్ల విలువైన ఆస్తులు
- ఇప్పటికే పాలకవర్గానికి పొడిగింపు ఇవ్వని ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రోస్‌తో పాటు ప్రధానంగా నాగార్జున జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీపై దృష్టి సారించింది. అదేవిధంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ అథారిటీ,మార్క్‌ఫెడ్ వేర్ హౌసింగ్‌లను విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. విలీన ప్రక్రియకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులను ఆదేశించింది. విత్తనాలు, ఎరువుల సరఫరా ధాన్యం కొనుగోలు, తదితర సేవలు అందించేందుకు గతంలో డీసీఎంఎస్‌లు ఏర్పాటయ్యాయి. అయితే వీటికి సరైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో అభివృద్ధి చెందలేదు. డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ఉద్యోగుల కొరత, తాత్కాలిక ఉద్యోగుల నియామకం, పాలకవర్గాలు ఆసక్తిగా పనిచేయకపోవడంతో ఇవి ప్రభుత్వానికి భారంగా మారాయి.

రూ.100కోట్లకు పైగా ఆస్తులు

నాగార్జున జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.100కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మూడు ఎకరాలు, యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో దుకాణాల సముదాయం ఉంది. గతంలో ఈ ఆస్తుల విక్రయం వివాదాస్పదంగా మారి కోర్టుల వరకు వెళ్లింది. అప్పట్లో పాలకవర్గం నిర్ణయాలు చర్చనీయాంశంగా మారాయి. పాలకవర్గంలో తీర్మానం జరిగిందా? లేక వ్యక్తిగతంగా విక్రయించారా? అనేదానిపై ఉమ్మడి జిల్లాలో చర్చకు దా రి తీసింది. నల్లగొండ జిల్లా కేంద్రమైన గడియారం సెంట ర్ సమీపంలో విలువైన ఆస్తులతో పాటు నిడమనూరు లో మూడు ఎకరాలు, యాదాద్రి జిల్లా రామన్నపేటలో గోదాములు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోట్ల రూపాయల విలువైన ఆస్తులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. గతంలో ఓ పాలకవర్గం హయాంలో డీసీఎంఎస్ ఆస్తులను దుర్వినియోగం చేయడంతో సమస్యలు చోటుచేసుకున్నాయి. ఆస్తుల రికవరీ కూ డా సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డీసీఎంఎస్‌ను పూర్తిగా రద్దు చేయడం కోసం కార్యాచరణకు సిద్ధమైంది. ప్రభుత్వ సొమ్ము, ఆస్తులు దుర్వినియోగం అవుతుండటంతో వాటిని కాపాడడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు నష్టం కాకుండా ఉండేలా ప్రణాళిక రూపొందించి ఆ వైపుగా అడుగులు వేస్తోంది. దీనికి తోడు డీసీఎంఎస్ నిర్వహణ ప్రభుత్వానికి భారంగా మారింది. ఉద్యోగుల జీతభత్యాలు ఇవ్వడం కూడా కష్టతరమైంది. కనీసం డీసీఎంఎస్ కార్యాలయంలో ఫర్నీచర్ కూడా లేని దుస్థితి నెలకొంది. తాత్కాలిక ఉద్యోగులే ఉన్నప్పటికీ వారికి సకాలంలో వేతనాలు అందని పరిస్థితి ఉంది.

నివేదిక సేకరించిన ప్రభుత్వం

ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆ సొసైటీ అధికారుల నుంచి ప్రభుత్వం వివరాలు తీసుకుంది. ఈ నేపథ్యంలో డీసీఎంఎస్ మేనేజర్ ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్ ఆస్తులు,వాటి వివరాలను ఆ నివేదికలో పొందుపర్చారు. అదేవిధంగా సంబంధిత సొసైటీలో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలు,తాత్కాలిక ఉద్యోగులు, జీతభత్యాలు, తదితర వివరాలను సేకరించింది. డీసీఎంఎస్‌ను మూసి వేసేందుకు ప్రభుత్వ...

- మిగతా 7వ పేజీలో...

ముగ్గు పోయకుంటే రద్దే

- నిర్మాణం ప్రారంభం కాని ఇళ్లు 1,807
- గడువు ఇచ్చినా పలు కారణాలతో ముందుకురాని లబ్ధిదారులు

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా నిర్మాణాన్ని ప్రారంభించకుంటే వాటిని అధికారులు రద్దుచేసి అర్హులైన మరొకరికి వీటిని కేటాయిస్తున్నారు. జిల్లాకు మొత్తం 9,597 ఇందిర మ్మ ఇళ్లు మంజూరు కాగా, అందులో 1,807 ఇళ్ల నిర్మాణం నేటికీ ప్రారంభం కాలేదు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలకు గృహ నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. అయితే ఇళ్లు మంజూరు చేసినా, నేటికీ కొందరు నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ప్రభుత్వం సాయం చాలదని కొందరు, ప్రభుత్వ కొలతలతో నిర్మిస్తే ఇళ్లు ఇరుకుగా ఉంటుందని మరికొందరు ముందుకు రావడంలేదు. ఇంకొందరు సాంకేతిక సమస్యలతో వెనకడుగు వేస్తున్నారు. వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇళ్లు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు ముగ్గు పోయకుండా ఉన్న లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు జారీచేసింది. వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో వారి స్థానంలో అర్హులైన కొత్తవారికి ఇళ్లను మంజూరు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. యాదాద్రి జిల్లాలో ఈ పథకం కింద తొలి విడతగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఐదు నియోజకవర్గాల్లో 9,597మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 7,890 మంది ముగ్గు పోసి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి. బేస్‌మెంట్ స్థాయిలో 6,736, రూఫ్‌లెవల్‌లో 3,570, స్లాబ్ లెవల్లో 1,898, 100శాతం పూర్తయిన ఇళ్లు 42 వరకు ఉన్నాయి. ఈ పథకం డబ్బుల జమ ఆలస్యం కాకుండా అధికారులు చూస్తున్నారు.

ముగ్గులు పోయని ఇళ్లు 1,807

యాదాద్రి జిల్లాలో మొత్తం 17మండలాలు 427 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. ప్రభుత్వం రెండు విడతల్లో 9,597 ఇళ్లను మంజూరు చేసింది. అయితే ఇప్పటివరకు ముగ్గులు పోసుకుని ఇళ్ల జిల్లాలో మొత్తం 1,807వరకు ఉన్నాయి. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ఇచ్చిన గడువులో ముగ్గులు పోసుకోకపోవడంతో వీరి స్థానంలో వేరేవారికి అవకాశం కల్పించాలని యోచిస్తున్నారు. భువనగిరిలో నియోజకవర్గంలో మొత్తం 3,297 ఇళ్లు మంజూరు కాగా, 627ఇళ్లు ముగ్గులు ప్రారంభించలేదు. అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలో 3,824ఇళ్లకు 726, మునుగోడు నియోజకవర్గం (చౌటుప్పల్, నారాయణపూర్)లో 1,314ఇళ్లకు 230 ఇళ్లకు ముగ్గు పోయలేదు. తుంగతుర్తి నియోజకవర్గం(అడ్డగూడూరు, మోత్కురు)లో 573ఇళ్లకు 89, నకిరేకల్ నియోజకవర్గం(రామన్నపేట)లో 689ఇళ్లకు 135 ఇప్పటికే ముగ్గులు పోసుకోలేదు.

ఇళ్లను సకాలంలో ప్రారంభించాలని పలుమార్లు గడువు ఇచ్చినప్పటికీ, లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. లబ్ధిదారుల నుంచి స్పందన లేకపోవడంతో వారిని నుంచి అంగీకారపత్రం తీసుకుని, ఇళ్లను రద్దు చేసి వేరే వారికి మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రైతుల ఇబ్బందులను పట్టించుకోని ప్రభుత్వం



మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల, నాయకులు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీనీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా చూసినా హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయని, పంటలు నష్టపోయి రైతులు విలవిలాడుతున్నారన్నారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మంత్రులు కమీషన్లు, సంపదలపై దృష్టిసారించారని, విదేశీ టూర్లలో జల్సాలు చేస్తున్నారని అన్నారు. రైస్ మిల్లుల వద్ద కోట్ల రూపాయలు లంచాలు తీసుకుంటున్నారని, దీంతో మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారన్నారు. ఎక్కడా చూసినా మొలకలు వచ్చిన ధాన్యం కనిపిస్తోందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యాన్ని, పత్తిని కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఇబ్బందులను గురిచేయడమే ధ్యేయంగా పనిచేస్తోందని, యూరియా కొరతతో ఇబ్బందులు పెట్టిన ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, బోనగిరి దేవేందర్, తుమ్మల లింగస్వామి, రావుల శ్రీనివాస్ రెడ్డి, మారగోని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశాం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని 10 మండలాల పరిధిలో కొంతమేర తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సుమారు 4,600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందన్నారు. రైతులు ఆ ధాన్యాన్ని ఆరబెట్టారని, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు సుమారు 2,653 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించామన్నారు. అదేవిధంగా, ఆ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేశామని, రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేశామన్నారు. రైతులు అధైర్యపడవద్దని, ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం వచ్చాక కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు.

ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు చర్యలు...

సెట్విన్ ఆధ్వర్యంలో యువత, విద్యార్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం సెట్విన్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేకించి విద్యార్థినులు 10వ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తయ్యాక వెంటనే ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రణాళిక తయారు చేయాలన్నారు. సెట్విన్ ద్వారా అందించే కోర్సులు, వాటికి విద్యార్హతలపై జిల్లాలోని అన్ని సంక్షేమ కళాశాలలు, పాఠశాలలు, కేజీబీవీల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు ఒక షెడ్యూల్ రూపొందించాలని, వచ్చేవారం ఇవి ప్రారంభించాలన్నారు. అంతకుముందు సెట్విన్ ప్రతినిధి రేణుక మాట్లాడుతూ, సెట్విన్ ద్వారా సుమారు 30 కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

లైంగిక దాడులు జరగకుండా చర్యలు

శిశువిక్రయాలు, బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరగకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఎక్కడైనా శిశు విక్రయాలు జరిగితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహాలపై విస్తృత ప్రచారం కల్పించాన్నారు. సీడీపీవోలు వారి పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దేవరకొండ, నేరేడుగోమ్ము, చందంపేట, పెద్దవూర, అడవిదేవులపల్లి, తదితర ప్రాంతాల్లో శిశువిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిపై సీడీపీవోలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వాల్ పోస్టర్లు, కరపత్రాలు, ప్లెక్సీలు, వీడియోల ద్వారా చైతన్యం కల్పించాలన్నారు. వచ్చేవారం సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ పీడీ రాజ్ కుమార్, డీఈవో భిక్షపతి, డీపీవో వెంకయ్య, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డి, డీటీడీవో ఛత్రునాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): వర్షాలతో ధాన్యం తడవ కుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం నల్లగొండల మండలంలోని చిన్న సూరారం, కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, కొత్తపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేశారు. ధాన్యం తడవకుండా ముదస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన బస్తాలు, లారీలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఇదిలా ఉండగా కేతేపల్లి మండలంలోని కొత్త పేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దనున్నారు. అందుకు సాధ్యాసాధ్యాలను కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, డీసీఎస్‌వో వెంకటేశం, డీసీవో పత్యానాయక్, కేతేపల్లి తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, డీటీసీఎస్ జ్యోతి, ఏపీఎం మల్లేష్, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సహకరించాలి

సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా మిల్లర్లు సహకరించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ కోరారు. స్థానిక సబ్‌కలెక్టరేట్ కార్యా లయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. వర్షాలతో పంటలు దెబ్బతిన్నందున తేమ, తాలూ లాంటి కొర్రీలు పెట్టకుండా మిల్లు పాయింట్ల వద్దకు వ చ్చిన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. వేబ్రిడ్జిల వద్ద తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. తూనికల కొలతల అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. రైతులు మేలైన ధా న్యాన్ని తేవాలని సూచించారు. బయటి రాష్ట్రాల నుంచి ధాన్యం రాకు ండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే ధాన్యం లోడ్‌లకు టోకెన్లు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

శిశు విక్రయాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి

జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి

వేములపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శిశు విక్రయాలకు తావు లేకుండా ఐసీడీఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన సెక్టార్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టవిరుద్ధమైన దత్తత ఇచ్చిన వారు శిక్షార్హులని, అందుకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారని ఆమె అన్నారు. మైనర్ బాలికలపై అత్యాచారం, అక్రమ శిశు రవాణా, బాల్య వివాహాలు వంటి వాటిపై అంగన్‌వాడీ టీచర్లకు ఆమె అవగాహన కల్పించారు.

క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు రెండు, మూడవ సంతానంలో ఆడపిల్లలు జన్మించిన ఇళ్లను ప్రతినిత్యం సందర్శించి పర్యవేక్షించాలని ఆమె అన్నారు. ఎవరికైనా ఆర్థిక ఇబ్బందులతో భారంగా భావిస్తే జిల్లా శిశు కేంద్రాలకు అప్పగించాలే కాని అక్రమ దత్తతకు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్



పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థు స్కాలర్షిప్, రీయింబస్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, లేకుంటే విడుదల చేసేంత వరకు పోరాటాలను నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ హెచ్చరించారు. పెండింగ్ స్కాలర్షిప్, ఫీయిజ్‌రియంబస్ మెంట్ విడుదల చేయాలని అందుకు నిరసనగా, భారత విద్యార్థి ఫెడరేషన్ నల్లగొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 8150 కోట్ల స్కాలర్షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పేద, మధ్య తరగతి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకోలేక విద్యకు దూరం అవుతున్నారని అవేధన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యా సంస్థలు ఈనెల 3 నుంచి కళాశాలలు బంద్ చేసి నిరవధిక సమ్మెచేసేందుకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నల్లగొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏసైఫ్, మారుపాక కిరణ్, నవదీప్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనానికి సర్వం సిద్ధం

- ముస్తాబైన ఎన్జీ కళాశాల మైదానం
- నల్లగొండకు చేరిన దున్నరాజులు

నల్లగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదవుల సంస్కృతిలో గో సంపదకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. గో సంపదను కాపాడుకునేందుకు యాదవులు అనేక పద్ధతులను పాటిస్తూ ఉంటారు. దీపావళి తర్వాత రెండో రోజు సదర్ సమ్మేళనం నిర్వహించడం ఆనవాయితీ. ఏటా ఏడు దున్నరాజులతో వైభవంగా యాదవులు సదర్ సమ్మేళనం నిర్వహించి వారి ఐక్యతను చాటుకుంటారు. అందులో భాగంగానే ఆదివారం సాయంత్రం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో యాదవుల సదర్ సమ్మేళనానికి సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే హరియాణ, హైదరాబాద్ నగరాల నుంచి దున్న రాజులను నల్లగొండకు తీసుకొచ్చారు. దున్న రాజులను అలంకరించే పనిలో యాదవులు నిమగ్నమయ్యారు. పురవీధుల గుండా దున్న రాజుల ఊరేగింపు శోభాయమానంగా సాగనుంది. దున్న రాజుల ఊరేగింపుతో పాటు ఆ ఊరేగింపులో పోతరాజు విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆకర్షణగా నిలవనున్నాయి. అవార్డు గెలుచుకున్న గోల్ టు బజరంగీ, సేహంష, కోహినూర్ దున్న రాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలవనున్నాయి. కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా నిర్వహించి యాదవుల సదర్ సమ్మేళనానికి అందరూ హాజరు కావాలని ఇప్పటికే ఉత్సవ సమితి ఆహ్వానం పలికింది. సదర్ సమ్మేళనం నిర్వహించే ఎన్జీ కళాశాల మైదానాన్ని తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు. ఈ సదర్ సమ్మేళనంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన యాదవులు, యాదవ కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేశారు.

రిజర్వేషన్లకు అడ్డంకులు కలగకుండా చూడాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లకు అడ్డంకులు కలగకుండా చూడాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారందిశగా అడుగులేసేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు కావడం అవసరమన్నారు. దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న వెనుకబడిన వర్గాలకు దక్కినఅవకాశం చెదరకుండా చూడాలని కనకదుర్గ అమ్మవారికి మొక్కినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, శ్రీను, అంజి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కమంలో సంఘ నాయకులు శివరామకృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేయాలి

బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో పోటీ చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావడం పోరాట ఫలితమేనన్నారు. రిజర్వుడ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో పోటీచేస్తేనే బీసీల రాజ్యాధికార కల సాకారమవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తాచాటితే భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని, అందుకు బీసీలంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బహుజన రాజ్యాధికార సాధనకు ముందడుగు వేయాలన్నారు.

15న లోక్ అదాలత్

నల్లగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం ఈనెల 15న ప్రత్యేక లోక్ ఆదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జి.సంపూర్ణ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కక్షిదారులు ఈ నెల 15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌లో వారి పెండింగ్ కేసులు, పీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

5 కి.మీలు.. 60 నిమిషాలు



- పెద్దకాపర్తి వద్ద ట్రాఫిక్‌జాం
- రామన్నపేట మీదుగా వాహనాల మళ్లింపు

6

నేడు భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం

మిర్యాలగూడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ సమావేశం ఆదివారం మిర్యాలగూడలో నిర్వహిస్తున్నట్లు బీకేఎస్ మండలాధ్యక్షుడు కొణతం లింగారెడ్డి శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సమస్యలపై చర్చించి సంఘటిత పరిచేందుకు కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘటన మంత్రి మాదిరెడ్డి రాజిరెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లను గౌరవించాలని మేరా యువ భారత్ ప్రతినిధి నేరెళ్ల అజయ్ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శ్రీరామ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. మూడురోజుల పాటు నిర్వహించే సేవా కార్యక్రమంలో యువత పాల్గొనాలని కోరారు. అనంతరం పట్టణ శివారులోని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. సాయిఈశ్వర్, యశ్వంత్, గిరీష్, మంజునాథ పాల్గొన్నారు.

నేరేడుగొమ్ము పోలీస్‌స్టేషన్ తనిఖీ



ప్రశంసాపత్రాల అందజేతలో పాల్గొన్న ఏఎస్పీ, సీఐ, ఎస్ఐ

నేరేడుగొమ్ము, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను దేవరకొండ ఏఎస్పీ మౌనిక శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్‌బ్యారక్, టెక్నికల్‌రూం, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వర స్పందించి సేవలు అందించాలని సూచించారు.. మండలంలో ఆయా కాలనీలలో సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. గణేష్ నిమజ్జనం బందోబస్తు ఉత్సాహంతో పాల్గొన్న పోలీసులు, వలంటీర్లకు ప్రశంసాపత్రాలు, షీల్డ్ అందజేశారు. అనంతరం పోలీ సు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ బీసన్న, ఎస్ఐ నాగేంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు మహేష్, రాజు, నరేందర్‌రెడ్డి, ప్రశాంత్, పవన్, స్వాతి, అనూష, హోంగార్డులు యాదయ్య, లక్ష్మణ్, తిరుపతి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పరిహారం అందించాలి

అడవిదేవులపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన తమకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని మత్స్యకారులు శనివారం తహసీల్దార్ రాగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తుఫాన్ కారణంగా సత్రశాల వద్ద కృష్ణానదిలో భారీగా అలలు రావడంతో చేపల వేటకు వెళ్లేందుకు వీలు కాకపోవడంతో వలలు, పుట్టీలు అక్కడే ఉంచి ఒడ్డుకువచ్చామని, వరద తీవ్రత తగ్గిన తరువాత నది ప్రాంతం వద్దకు వెళ్లి చూడగా నదిలో చేపల కోసం వేసిన వలలు, పుట్టీలు గల్లంతయ్యాయని పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్తూ సుమారు 22 మంది మత్స్యకారులు జీవనం కొనసాగిస్తున్నామని నష్టపోయిన తమకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

బీసీల రిజర్వేషన్లకు పరిష్కారం చూపాలి



పీ.టీ.నగర్‌లో అభివాదం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

చింతపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్)లో బీసీ సంఘం సభ్యులు, కళాశాల విద్యార్థులతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత కేతావత్ బీల్యానాయక్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రావు, కాశగోని వెంకటయ్య, అంకం శ్రీనివాస్, లక్ష్మణ్ సాగర్, అంగిరేకుల శ్రీకాంత్, జగదీష్, చిట్టిప్రోలు వెంకటేశ్వర్లు, వినీత్, రాజీవ్, కర్నాటి గణేష్, దువ్వ శ్రీనివాస్, మునగాటి పురుషోత్తం పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



ఆర్థిక సాయం అందజేస్తున్న కొండేటి మల్లయ్య

మాడ్గులపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో ఇటీవల మృతిచెందిన కాసాని అశోక్‌గౌడ్ కుటుంబానికి రూ.10వేలు, పిచ్చయ్య కుటుంబానికి రూ.5వేలు, చిగుర్ల సైదులు కుటుంబసభ్యులకు రూ.5వేలు అందించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ చింతరెడ్డి సైదిరెడ్డి, మాజీ సర్పంచ్ బొడ్డ యాదయ్య, నాయకులు కొండేటి శంకర్, పగిళ్ల వెంకటేశ్వర్లు, బెజవాడ అయోధ్య, లింగస్వామి ఉన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

నాగార్జునసాగర్,నవంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చిల్క ఏకాదశమి పురస్కరించుకుని స్థానిక హిల్‌కాలనీలో శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది దంపతులు వ్రతాల్లో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు రాధయ్య, రామానుజం, వెంకటాచార్యులు, భక్తులు కిశోర్, పద్మ, , శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- ఇటీవల వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి -చందంపేట,): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రా మా ల రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రధాన రహదారు లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మండలంలోని ముడుదండ్ల, అచ్చంపేట పట్టి, తెల్‌దేవరపల్లి, పొ గిళ్ల, కంబాలపల్లి రహదారులు అధ్వానంగా మారాయి. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం, అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్తులు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వర్షం కారణంగా దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



శేషులేటి వాగు ఉధృతికి కొట్టుకుపోయిన మొసంగి - ముక్కముల రోడ్డు

గుర్రంపోడు మండలంలో..

గుర్రంపోడు : మండలంలో శేషిలేటివాగు ఉధృతికి కోతలాపురం, మొసంగి-ముక్కాముల గ్రామాల మధ్య వాగుపై గలమట్టిరోడ్లు కొట్టుకుపోయాయి. వాగుపై గల ఈ రెండుచోట్ల వేసిన గూనలు తాత్కాలికంగా పోసిన మట్టి కొట్టుకుపోయింది. ఈ క్రమంలో కోతలాపురం గ్రామస్తులు మండల కేంద్రానికి నడికుడ మీ దుగా చుట్టూ తిరిగి చేరుకోవాల్సి వస్తుందని కోతలాపురం మాజీ సర్పంచ్ రావులపాటి భాస్కర్ తెలిపారు. మొసంగి గ్రామ రైతుల భూములన్నీ ముక్కమల గ్రామ దారిలో ఉండడం, తెగిన రోడ్డుతో రైతులు సరకు రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



వర్షానికి దెబ్బతిన్న అచ్చంపేటపట్టికి వెళ్లే రోడ్డు

రోడ్లు తెగిపోవడంతో ఇబ్బందులుపడుతున్నాం



వర్షంతో రోడ్లు తెగిపోయాయి. దీంతో ఎటు వెళ్లలేకపోతున్నాం. పొగిళ్లకు వెళ్లాలంటే రోడ్డు తెగిపోయింది. దీంతో పొగిళ్ల గ్రామం నుంచి దేవరకొండకు చేరుకోవాలంటే దాదాపు 20 కిలోమీటర్ల దూరం చుట్టు తిరిగి వెళ్ల వలసి వస్తుంది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. - మేకల వెంకటేష్, పొగిళ్ల

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పసుపులేటి మధు, ఎస్ఐ, గుర్రంపోడు



గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పసుపులేటి మధు హెచ్చరించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నటు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.
(ఆంధ్రజ్యోతి-గుర్రంపోడు)

ఆంధ్రజ్యోతి: మండలంలో శాంతి భద్రతల పరిస్థితి ఎలా ఉంది?

ఎస్ఐ: మండలంలో ఎక్కడ ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతమైన వాతావరణం నెలకొంది.

ఆంధ్రజ్యోతి: మైనర్లువాహనాలు నడిపితే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: 18 ఏళ్లు నిండిన వారే వాహనాలు నడపాలి. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతోపాటు వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్ఐ: మండలంలోని గ్రామాల్లో మండల కేంద్రంలో ఉన్న కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో షీటీమ్‌లతో యువతకు రక్షణ, మత్తు పదార్థాల నిర్మూలనపైఅవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిపై రోడ్డు వెంట తోపుడు బండ్లలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: మండల కేంద్రంలో రోడ్లపై తోపుడుబండ్లు లేకుండా చూస్తున్నాం. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నాం.

పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

దేవరకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నల్లగొండ జిల్లా విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపిచంద్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం దేవరకొండలో పలు కళాశాలల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట ధర్నా చే సి మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చే స్తుందన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజులపై రాష్ట్రంలో 15 లక్షల మంది విద్యార్థులు ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా పేద, మధ్యతరగతి విద్యార్థులతో చలగాటం ఆడుతుంద ని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌విడుదల చేసేంతవరకు ఏబీవీపీ విద్యార్థులతో కలిసి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి హేమసుందర్, పగిళ్ల విక్రమ్, శంకర్, కొండల్, రాకేష్, చందు, అరవింద్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

స్కాలర్ షిప్ విద్యార్థుల హక్కు

మిర్యాలగూడ : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వాల భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్రసైదానాయక్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని సంఘం ఆధ్వర్యంలో చెప్పులు కుట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆరేళ్లుగా బకాయిపడిన రూ.8,150 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెం టనే విడుదల చేయాలన్నారు. ప్రైవేటు కళాశాల్లో ఫీజు బకాయిలు ఉండటం వల్ల విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని అన్నారు. బకాయిల నిధుల విడుదల కోసం కళాశాల యా జమాన్యాలు బంద్‌కు పిలుపునిస్తే వారి తో చర్చలు జరిపి రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి మాట తప్పడంతో తిరిగి కళాశాల మూసివేతకు యాజమాన్యాలు సమాయత్తమవుతున్నాయని అన్నారు. కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్, నాయకులు బన్ని, సిపాయి, సాయి, రాకేష్, దేవా, సంజయ్, హనుమాన్ పాల్గొన్నారు.



చెప్పులు కుట్టి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

చింతపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్)లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తుందన్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, పూల యాదయ్య, బాదేపల్లి పులిరాజ్ గౌడ్, గొడకొండ్ల గ్రామశాఖ అధ్యక్షుడు ఆకుతోట నరసింహ, మల్లోజు జగన్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

దేవరకొండ: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని 18వ వార్డులో శనివారం ధ్యాన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు రవీంద్రకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంజిగౌడ్, చింతపల్లి సుభాష్‌గౌడ్, నీల రవికుమార్, వేముల రాజు, కృష్ణ, జానిబాబా, తులసిరాం, లక్ష్మణ్, మాడెం రాములు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ప్రతి ఒక్కరూ సాయినాథుని అనుగ్రహం పొందాలి

చింతపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ చింతపల్లి సాయినాథుని అనుగ్రహం పొందాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. కొండమల్లేపల్లిలో పంట నష్టపోయిన రైతులను కలిసేందుకు శనివారం వెళ్తూ మార్గ మధ్యలో చింతపల్లిలో కొద్దిసేపు ఆగారు. ఈ మేరకు ఆలయ కమిటీ, స్థానిక బీజేపీ శ్రేణులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. షిర్డీసాయిబాబాను దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ఛైర్మన్ బీజేపీ నాయకులు ఆమెను శాల్వతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మంచికంటి ధనుంజయ్య, శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, కేతావత్ లాలు నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, దావా శ్రీనివాస్, కుక్కడపు రామకృష్ణ, గజ్జె అభినవ్ పాల్గొన్నారు.



సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎంపీ అరుణ

అక్రమ దత్తత, పిల్లల విక్రయంపై అప్రమత్తంగా ఉండాలి

మాడ్గులపల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): అక్రమ దత్తత, పిల్లల విక్రయంపై అప్రమత్తంగా ఉండాలని ఐసీపీయూ లీగల్ ఆఫీసర్ వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో గర్భిణులు, హోం విజిట్ చేసి తల్లులకు అవగాహన కల్పించి మిషన్ వాత్సల్య ద్వారా పిల్లలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రభుత్వానికి రూ.6వేల డీడీ చెల్లించాలన్నారు. అనంతరం పాపను తీసుకునే సమయంలో రూ.50వేలు డీడీ కట్టి కోర్టులో లీగల్‌గా తీసుకోవాలన్నారు.

సమావేశంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ రమణి, సూపర్‌వైజర్ లక్ష్మీ, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో పంటనష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గూడూరు గ్రామంలో నేలకొరిగిన వరి పొలాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులను సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దెబ్బతిన్న పంట పొలాలకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పంట నష్టం అంచనా వేయడం లేదన్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.30 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, రవీందర్, మధు, కోటిరెడ్డి, నాగేశ్వర్‌రావు,సత్యం, వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష పదవి బీసీలకివ్వాలి

- *టీపీసీసీ అధ్యక్షుడిని కోరిన లింగంగౌడ్*

మిర్యాలగూడ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరినట్లు బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్నది బీసీలేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా పదవులు ఆశించకుండా పార్టీ కోసం కష్టపడే బీసీలకు జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే మరింత ఉత్సాహంగా పని చేస్తారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే పదవి దక్కని బీసీలకు టీపీసీసీ ప్రెసిడెంట్ పదవి దక్కితే సామాజికవర్గమంతా ఆనందిస్తుందన్నారు.

హరీష్‌రావుకు ఎంపీ రఘువీర్‌రెడ్డి పరామర్శ

హాలియా, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి చెందగా నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి శనివారం కోకాపేట క్రిన్స్ విల్లాస్‌లో హరీష్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట రమ్యరావు తదితరులు ఉన్నారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితే భవిష్యత్ బంగారుమయం అవుతుందని ఎంఈవో లావూరి బాలు అన్నారు. గ్రూప్-1 ర్యాంకు సాధించి, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించిన లిటిల్ ఫ్లవర్ పాఠశాల పూర్వ విద్యార్థిని కొండిపర్తి సత్యవేదను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని చదివితే తప్పక విజయం సాధిస్తారన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధింగలుగుతారన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించి కలెక్టర్ అవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత కొలువు సాధించిన సత్యవేదను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా పట్టణ అధ్యక్షుడు శ్రీపతి శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్, డైరెక్టర్ జీన్సీ హెచ్ఎం సుజయ్‌కుమార్, ఐబీటీ హెడ్ ఎరగాని ప్రసాద్, సత్యవేద తండ్రి, మైక్రో ఆర్టిస్ట్, సత్యవేద తండ్రి కృష్ణమాచారి, తల్లి శ్రీదేవి పాల్గొన్నారు.



గ్రూప్-1 ర్యాంకర్‌ను అభినందిస్తున్న ఎంఈవో

రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంఘ రాష్ట్ర నాయకుడు బాసాని గిరి కోరారు. బుధవారం సంఘ సమావేశం అమరవీరుల స్మారక పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో రజకులకు సముచిత స్థానాలు ఇవ్వాలని రాజకీయ పార్టీలను కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావడం పట్ల రజకసంఘం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. సామాజిక బాధ్యతల నిర్వహణలో రజకులది ప్రత్యేకమైన స్థానమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యాదగిరి, దుర్గయ్య, అజయ్, శివ, కోటేష్, ఎల్లయ్య, సైదులు, రాజు, రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ వాహనాలకు వేలం రేపు

దేవరకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సీజ్ చేసిన వాహనాలకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు చక్రాల వాహనాలకు రూ.30వేలు, ద్విచక్ర వాహనాలకు రూ.10వేలు ఎక్సైజ్ కార్యాలయంలో డిపాజిట్ చేయాలని, ఆసక్తి ఉన్నవారందరు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.